ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 30, 2015



యుద్ధ కళా ఖండం

శంకరమంచి జానకి అంటే గుర్తుపట్టరేమో! అదే షావుకారు జానకి అనగానే ‘భలేవారే! ఆవిడ తెలియనివారుంటారా? ఆ కంఠం...ఆ నటన మర్చిపోతామా!’ అనేస్తారు. రాజమండ్రిలో జన్మించిన జానకి కెరీర్ రేడియోతో ప్రారంభమై పలు మలుపుల అనంతరం సినిమాకు చేరుకుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చాక ... వెండితెర వేల్పుగా వెలుగొందడమంటే మాటలు కాదు. పెద్దగా చదువుకోకపోయినా పలు భారతీయ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలగడం జానకి ప్రత్యేకత.

దటీజ్ షావుకారు జానకి

- బి.బి.సి వార్తలు వింటూ, హిందూ పేపరు పైకి పెద్దగా చదువుతూ పెరిగింది జానకి. ఆమెకు చక్కటి ఉచ్ఛారణ అబ్బడానికి అదే తోడ్పడింది.
- కుటుంబం రాజమండ్రి నుంచి మద్రాసు చేరుకున్నాక జానకి ఆల్ ఇండియా రేడియో ఆడిషన్‌కి వెళ్లింది. బిగ్ బి అమితాబ్ బచ్చన్, బాలీవుడ్ ప్రసిద్ధ గాయకుడు కిషోర్ కుమార్‌ను తిరస్కరించిన ఆల్ ఇండియా రేడియో వారు జానకికి అవకాశమిచ్చారు. అందుకు తగ్గట్టుగానే తన ప్రతిభాపాటవాలను చక్కగా నిరూపించుకొంది.
- రేడియో కళాకారిణిగా మొదట్లో చిన్నపిల్లల కోసం కార్యక్రమాలు నిర్వహించినా ఆ తర్వాత ఇతర ప్రధానమైన ప్రోగ్రాములూ చేసింది. అప్పట్లో రేడియోలో తన కంఠాన్ని అందరూ ఇష్టపడేవారు. వారిలో నిర్మాత బి.న్.రెడ్డి ఒకరు. ఆ మధురస్వరం ఎవరిదో తెలుసుకోవాలన్న ఉత్సుకత కలిగిందాయనలో. వాకబు చేసి తెలుసుకొని తన సినిమాలో నటించమని ప్రతిపాదించారు. ఆశ్చర్యానందాలకు గురైన జానకి అందుకు సుముఖంగానే వున్నా తల్లితండ్రులు మాత్రం ఒప్పుకోలేదు. పైగా ఆమెకు వెంటనే పెళ్లి చేసేశారు. ఓ పాపకు జన్మనిచ్చాక రెడ్డిగారి మాట గుర్తొచ్చింది. ఆయనను కలిసి ఆడిషన్‌లో పాల్గొని...ఏడు విభిన్నమైన భావాలను అద్భుతంగా ప్రదర్శించింది. తర్వాత ఆ విషయమే మర్చిపోయి దైనందిన జీవితంలో పడిపోయింది. అకస్మాత్తుగా ఒకరోజు ఎన్.టి.రామారావు, ఎల్.వి.ప్రసాద్, మార్కస్ బార్ట్లీ వంటి దిగ్గజాలు ఇంటికి వచ్చి తమ చిత్రంలో నాయికగా నటించాల్సిందేనని పట్టుపట్టారు. ఆ చిత్రమే ‘షావుకారు’. అందులో విషాద నాయికగా జీవించడమేకాక ... సినిమా పేరునే ఇంటిపేరుగా మలచుకుంది. ఆ తర్వాత పర భాషా చిత్రాల్లోనూ నటించనారంభించింది.
- ఎల్.వి.ప్రసాద్ షావుకారు జానకిని సినిమా ప్రపంచానికి పరిచయం చేస్తే కె.బాలచందర్ ఆమెను నాటకరంగానికి పరిచయం చేశారు. కెమెరా షూటింగులతో పనిలేకుండా ...ఏకాఏకిన ప్రేక్షకుల ఎదుట నటించాలనేసరికి మొదట్లో భయపడ్డా... తర్వాత ఆమె నటిగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడింది.
- ఇప్పటివరకు షావుకారు జానకి సుమారు 385 చిత్రాలలో చేసింది. ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, ఎమ్.జి.ఆర్, ఎమ్.ఆర్.రాధా మోహన్ ... వంటి తెలుగు, తమిళ అగ్రనటులందరి సరసన కథానాయి కగా మెరిసి ప్రేక్షకులను మెప్పించింది.

- ఒకసారి శివాజీగణేశన్‌తో కలిసి ‘పుదియ పరవై’ చిత్రంలో జానకి నైట్ క్లబ్ డాన్సర్ పాత్ర వేయాల్సి వచ్చింది. కాస్ట్యూమ్ డిజైనర్ తన కోసం కుట్టిన డ్రెస్ ఆమెకు ఏమాత్రం నచ్చలేదు. కొద్ది నెలల కిందట హాంగ్‌కాంగ్‌లో తను కొనుక్కొన్న డ్రస్ వేసుకుంది. అలానే మరొకసారి ఎమ్.జి.ఆర్‌తో కలిసి చేసిన ‘కంపన పాకిలే’ సినిమా కోసం తయారు చేయించిన దుస్తులు ఆమెకు నచ్చాయికానీ.. .ఎమ్.జి.ఆర్.ని మెప్పించలేకపోయాయి. ‘జానకి మంచి పేరున్న నటి. నా సినిమాలో తన హోదా ఎందుకు తగ్గాలి?” అనడంతో వాటిని మార్చాల్సి వచ్చింది. ఈ ప్రహసనం వల్ల షూటింగ్ కొన్ని గంటల పాటు వాయిదా పడింది.
- రజనీకాంత్ హీరోగా చేసిన ‘తిల్లు ముల్లు’ చిత్రంలో జానకి పాత్ర విభిన్నమైనది. ఒక పైప్ మీద నటించాల్సి వచ్చింది. దర్శకుడు బాల చందర్‌గారిని ఒప్పించి ఎలాంటి రిహార్సల్ లేకుండా చేసేసింది.
- షావుకారు జానకి బెంగళూరులో స్థిరపడినప్పటికీ తరచూ చెన్నై వెళ్లాల్సిందే. వంట, గృహాలంకరణ ఆమెకు ఎంతో ప్రీతిపాత్రమైన పనులు. “ఏదో ఒక నాడు పేరు, గుర్తింపు కోల్పోతానని తెలుసు. అందుకే నాకిష్టమయిన అభిరుచులను అంటిపెట్టుకునే వున్నాను’ అంటారామె.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

ఉచితం..ఉచితం..

ఊరకే వస్తుందంటే చాలు. ఫినాయిలైనా తాగేసే బ్యాచి ఒకటి వుంటుంది. ఎక్కడో కాదు. మన చుట్టూనే. మనలోనే. ఉచితంగా ఎక్కడ ఏం దొరుకుతుందా అని కళ్లల్లో కొవ్వొత్తులు వేసుకొని మరీ వెతుకుతుంటుంది. ఏం కొంటే ఏం ఫ్రీగా వస్తుందా అని భూతద్దాలు పెట్టుకుని మరీ చూస్తుంటుంది.

ఇదిగో ఈ వీక్ పాయింట్ పట్టుకునే వ్యాపారస్తులు లాభాల మీద లాభాలు గడిస్తున్నారు. చీర కొంటే జాకెట్ ఫ్రీ అన్న కొత్తలో ఎగబడి కొనేశాం (ఇప్పుడంటే అలవాటైపోయిందనుకోండి). దుప్పటి కొంటే రుమాలు ఉచితం అంటే చాలు. దుప్పటి అవసరమా లేదా చూడకుండా కొనేస్తాం. పైగా రుమాలు రోజూ వాడుకోవచ్చు కదా అంటూ కవరింగ్ ఇచ్చేస్తాం. 'సిమ్ కార్డు కొంటే ఉల్లిపాయలు ఫ్రీ' అని ప్రకటిస్తున్నారు ఓ అతితెలివి కంపెనీ వారు. ఉల్లి ధరల ఘాటు నషాళానికి అంటుతోంది కదా. సిమ్ కార్డు అవసరమైన వాళ్లు తప్పకుండా తమ దగ్గరకే వస్తారన్న ధీమా మరి. ఇక ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అన్న ప్రకటన కనిపించిందంటే చాలు. అవసరమా అనవసరమా అన్న ఆలోచన లేకుండా కొనేస్తుంటాం.

పెద్దలను చూసీ చూసీ పిల్లలు కూడా ఇదే రూట్లో నడుస్తున్నారు. వాళ్లకు సంబంధించిన వస్తువులు ఏవైనా కొనాల్సి వస్తే ఫ్రీ గా ఏమొస్తాయో చూస్తారు. వాటినే కొనిపెట్టమని అడుగుతారు. ఒకవేళ కాదన్నారో! వెనువెంటనే నిలబడిన చోటే... నేల మీద పడి దొర్లుతూ ...కంటికీ ముక్కుకీ ఏకధారగా ఏడ్చి మరీ సాధించుకుంటారు.

ఈ వ్యాపార సూత్రాన్ని ఆధ్యాత్మిక సంస్థలూ ఫాలో అవుతున్నట్టున్నాయి. ఈ మధ్యే శ్రీవారి భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా ఇవ్వాలని నిర్వాహకులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే భక్తి రసం ఏరులై పారుతోంది. ఇలాంటి ఉచిత లడ్డూ ప్రసాదాలు ఇవ్వనారంభిస్తే వరదలై పొంగి పొర్లుతుందేమో మరి.

ఇక రాజకీయ నాయకుల సంగతి సరేసరి. వీరు వ్యాపారస్తులను మించిపోయారు. ఎన్నికల సీజన్ వచ్చిందంటే చాలు. 'ఫ్రీ...ఉచితం..ఫ్రీ...' అన్న మాట మినహా మారు మాట వారి నోట రాదు. మన రాష్ట్రమే కాదు. ఏ భారతీయ రాష్ట్రంలో చూసినా ఎలక్షన్ 'ఫ్రీ' మేనియా కనిపిస్తుంటుంది. కలర్ టీవీలు, కంప్యూటర్లు, టాబ్లెట్లు, ఫోన్లు, సైకిళ్లు, మిక్సర్లు, గ్రైండర్లు, కరెంటు, నీళ్లు...! ఈ జాబితాకు ఆకాశమే హద్దు. అలా అలవోకగా ఉచితంగా ఇచ్చేస్తామని ప్రకటించేస్తారు. ఫ్రీ ఎరలు వేసి ఓట్లు గుద్దించుకొని సీట్లు కొట్టేస్తారు. తాత్కాలిక ప్రయోజనం అమాయక ఓటర్లను మాయ చేసేస్తుంది. తీరా పాలన మొదలయ్యాక... ఉచితానుచితాలు మరిచిన నేతలు ... ఒక్కో భారం నెత్తి మీద వేస్తూ వుంటే ... అప్పుడు కళ్లు తెరుచుకుంటాయి ఓటర్లకు. ఏం లాభం! జరగాల్సిన నష్టం జరిగే పోతుంది.

అందుకే! ఉచితం అన్న మాటను అస్సలు నమ్మకూడదు బాబోయ్! ■

◆ మనలో మాట



టపా

అమ్మ అనే పిలుపు..

రాజోదేవి లోహాన్ 70 ఏళ్ల వయస్సులో తల్లి కావడం నిజంగా ఆశ్చర్యం. సమాజంలో చాలా మంది తల్లి ప్రేమ కోసం వారి జీవితాలను పణంగా పెడుతుంటారు. బిడ్డలు లేని వారిని సమాజంలో ఎంత చులకనగా చూస్తారో మనకు తెలిసిన విషయమే. అమ్మ అనే పిలుపునకు ఎంత ఆరాటపడతారో తెలిస్తే ఈ అవమానాలు ఆగుతాయి. ఈ వ్యాసం అలాంటి వారికి ఊరట కలిగిస్తుంది.

ఎస్. మాధవి, కంకటపాలెం, గుంటూరు.

ఓ పాఠం

చంద్రకళ పేరు తెలియని తెలుగు వారు ఉండరు. తన పేరు గుర్తుచేసుకుంటేనే తను నటించిన చిత్రాలు కళ్లముందు కదలాడతున్నాయి. సినీ జీవితంలో ఎన్నో కష్ట సుఖాలను అనుభవించిన చంద్రకళ చివరి దశలో చాలా అధ్వాన్న స్థితిలో చనిపోవడం నిజంగా దురదృష్టకరం. ఇలాంటి వారి జీవితాలు నేటి సినీతారలకు ఒక పాఠం. అలనాటి స్మృతులను గుర్తుకు తెచ్చారు.

వి. పాండు, జమ్మలమడుగు, కడప.

వెర్రి తల

యువత ఫ్యాషన్ మోజులో తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటోంది. వెంట్రుకలను లవ్ సింబల్‌గా మార్చుకునే ప్రయత్నంలో చాలా మంది తమ ముఖాలను కాల్చుకుంటున్నారన్న విషయాన్ని చాలా చక్కగా వివరించారు.

సంపత్‌కుమార్, సంతనూతలపాడు.

కథ బాగుంది

ఎంకట లచిమి కథ చాలా బాగుంది. ఒక పల్లెటూరు అమ్మాయి తెలిసీతెలియని వయస్సులో చేసిన తప్పుకు జీవితాంతం బాధపడుతూనే ఉంటుంది. తను చేసిన పొరపాటును సరిదిద్దుకోవడంలో చేసిన ప్రయత్నాలను ఇవ్వడం ఎంతో ఉపయోగకరంగా వుంది.

ఎమ్. భారతి, కృష్ణలంక, విజయవాడ.

టెక్ మంత్ర

నేడు మనకు తెలియని సమాచారం కూడా అంతర్జాలంలో నిక్షిప్తం అయి ఉంది. మార్కెట్‌లో దొరకని వస్తువును సైతం నెట్‌లో సెర్చ్ చేసి మరీ కొనుక్కుంటున్నాం. విద్యార్థుల కోసం నేడు ఉచిత ఈ పాఠశాలలు వెలిశాయి. ఉచిత కోర్సులను, ఏయే సైట్‌లు, ఏయే కోర్సును ఆఫర్ చేస్తున్నాయి అనే సమాచారాన్ని అందించడం బావుంది.

కె. పల్లవి, కడియపు లంక.

దోమ మంచిదే

దోమ మంచిదే అనే మాటలో పాలకులకు ప్రజల ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ కంటే వ్యాపారుల లాభాలపై వున్న మక్కువను తెలుపుతున్నది. సర్పస్నేహి చమన్ సింగ్ పాము సంతతి నశించకుండా పాముల గురించి ప్రజలకు భయం పోవడానికి తాను రిస్క్ తీసుకొని ప్రచారం చేయడం చాలా చక్కగా వివరించారు.అణుబాంబు వల్ల అణు విద్యుత్ వల్ల కలిగే విపత్తుల గురించి చాలా చక్కగా వివరించారు.నేరం ఎవరిది అనే కథలో ఆ పిచ్చిదెవరు? ఆమె పిచ్చిది అనడానికి బలమైన కారణమేమిటి అన్న విషయం చివరి దాక చదివించింది. ఇలాంటి వ్యాసాలు మరిన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను.

ఇలిపిల్ల సూర్యనారాయణ
భీమనవారి పేట, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

యుద్ధ కళా ఖండం

కవర్ స్టోరీ 14

పంచభూతాల్ని ఆధారం చేసుకుని సాధన చేసే భారతీయ యుద్ధ కళలు బాహ్య, అంతర్గత శక్తులపై ప్రభావం చూపి సూపర్ హ్యూమన్‌ల స్థాయికి కళాకారులను చేరుస్తాయి. కుంగ్ ఫూ, కరాటే వంటి ఆసియా యుద్ధ కళల్లో మిళితమైన దక్షిణాసియా మూల యుద్ధ కళగా పేరొందిన అతి ప్రాచీన కలరిపాయట్టు దక్షిణ భారతావనిదే.ప్రపంచంలోనే అతి పురాతనమై మార్షల్ ఆర్ట్‌గా డాక్యుమెంట్ కాబడిన మల్లయుద్ధం మనదే. ఎన్నో దాడులను తట్టుకుని నిలబడిన భారతీయ మార్షల్ ఆర్ట్స్ ఇప్పుడు నిరాదరణ అనే స్వదేశీయుల మౌన యుద్ధంలో కనుమరుగు కాబోతున్నాయి.

కార్టూన్ పంచ్ 3

ప్రత్యేకం 4
ఆమ్టే నిరం'తరం'

యువ 5
నేను సోనాలి...

సినిమా కబుర్లు 6
పొగరు వగరు కలిసిన నటి

వింత లోకం 8
చేప ఎముక చిత్రం

నవ్వుల్ - పువ్వుల్ 9

కవిత్వం 10
నెగళ్ళు

సృజన 11
శానిటరీ పురుషుడు

కథ 18
గిజిగాడి గూడు

రుచి 21
ఎగ్ చట్నీ

బాలనేస్తాలు 22
వేట పగటి పూటే

కొత్త పుస్తకాలు 24
'జనరిక్'పై అనుమానాలు పటాపంచలు

కేరళ కాంతులు -12

కార్టూన్ పంచ్

రాత్రినుంచి ఇంట్లో రెండు ఉల్లిపాయలు కనబడ్డంలేదు సార్!!
?


మౌనమే నీ భాష ఓ మూగ మనసా!!
వివాదాలు, అపజయాలు
అవినీతి ఆరోపణలు
?!


పోవాన..? నా కళ్ళతో చూడవయ్యా! కనపడుద్ది!!
?
ఇంకా హోదాపై

చంద్రన్న ఢిల్లీ నుంచి ఏదో.. తెస్తున్నాడహో!
?!

ఆమ్టే నిరం'తరం'

బాబా ఆమ్టే సామాజికవేత్తగా సజీవులు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు కుష్టు నిర్మూలన కోసం ఉద్యమించిన ఆయన అడుగుజాడల్లోనే తర్వాతి తరాలు పని కొనసాగిస్తున్నాయి. ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని వచ్చిన ఇద్దరు కొడుకులు చెరో కార్యాన్ని భుజానికెత్తుకున్నారు. ఒకరు కుష్టురోగుల వెతలు తీర్చేందుకు నడుం బిగించగా, మరొకరు ఆదివాసీల వ్యథలు కడతేర్చేందుకు కంకణం కట్టుకున్నారు. కుష్టు రోగుల జీవితాల్ని సస్యశ్యామలం చేసిన మహారాష్ట్రలోని సోమ్‌నాథ్, ఆనందవన్‌ను పెద్ద కొడుకు వికాస్ ఆమ్టే కుటుంబం వికాసంలోకి తీసుకొస్తే, ఆదివాసీల ఆపద్బాంధువైన లోక్ బిర్దారీ ప్రకల్ప్ ప్రస్థానాన్ని ప్రకాశ్ ఆమ్టే కుటుంబం విస్తరిస్తోంది. బాబా కొడుకులే కాక ఇంటికి వచ్చిన కోడళ్లు కూడా తమ సేవాగ్రామాల పనుల్లో తలమునకలై ఉన్నారు. వారి తరానికి అండదండలుగా వారి బిడ్డలు కోడళ్లు, అల్లుళ్లు బాబా బాధ్యతల్ని భుజానికెత్తుకున్నారు. ఈ సేవా భూమిలో కులాలకు, మతాలకు, వర్గాలకు, ప్రాంతాలకు చోటు లేదు. అంతా నేల తల్లి బిడ్డలే. ఒక్క ఆరాధనాలయం కనిపించని ఆ ప్రాంగణాల్లో నిరంతరం మానవత్వం ప్రార్థన చేస్తుంది.

ఆమ్టే కుటుంబం మదియా గోండులకు అండదండా అయ్యింది. కుష్టు రోగులకు ఇష్టదైవంగా మారింది. బాబా ఆమ్టే అనే ఆదర్శం పుట్టి 100 ఏళ్లు అయినా మూడో తరమూ గిరిజనుల సేవలో తరిస్తోంది. మరో తరాన్ని ఆ ఆనందవనంలో సేవకై విరబూయిస్తోంది. వెన్ను బిగిసుకుపోయినా, ముదిమి వయసులోను కాశ్మీర్ నుంచి కన్యాకుమారీ వరకు దేశాన్ని జోడిస్తూ యాత్ర చేసిన బాబా ఆమ్టేను నిస్వార్థ సేవతో నిరంతరం స్మరించుకునేలా చేస్తున్నాయి ఆయన తర్వాతి తరాలు.

ఆనంద్‌వనం

కుష్టు రోగిని చూస్తే ఆమడ దూరం పారిపోయే మనుషుల నుంచి వారిని ప్రేమగా ఆదరించే తరాల్ని తయారు చేస్తోంది ఆనంద్‌వన్. 1951లోనే మొదలైన దీని సేవలు విస్తరించి విదేశాల నుంచి ప్రాజెక్ట్ పనులకు వచ్చే సామాజిక కార్యకర్తలక వాస్తవ కార్యక్షేత్రమైంది. ఓ చిన్న కుటీరంగా మొదలైన ఆ సేవాకేంద్రం విస్తరించి కేవలం శరణార్థుల ద్వారానే 1300 ఎకరాల్లో వ్యవసాయం జరుగుతోంది. కోట్ల రూపాయల టర్నోవర్‌తో ఉత్పాదనలు, చేనేత పరిశ్రమలు నడుస్తున్నాయి. డాక్టర్ వికాస్ భార్య భారతి, కూతురు శీతల్ పర్యవేక్షణలో ఆనంద్‌వన్ వృద్ధి చెందుతోంది. చికిత్స ద్వారానే కాక ఆర్థికంగాను, సామాజికంగాను, మానసికంగాను కుష్టు రోగుల జీవితాల్లో పరివర్తన తెస్తున్న ఆనంద్‌వన్‌కు ఆమె అంకితమైపోయింది. తన భర్త, తమ్ముడు కూడా ఈ పయనంలో ఆమెకు రెండు చేతులయ్యారు. ముంబైలో స్వరానందవన్ పేరిట సంగీత కళాశాల అంధులకు, అనాథలకు ప్రారంభించి మేటి కళాకారులుగా తీర్చిదిద్దుతోంది. శాటిలైట్ ప్రాజెక్టుల రూపంలో దేశమంతటా తిరుగుతూ వికాస్ ఆనంద్ కార్యక్రమాల్ని విస్తరిస్తున్నారు.

ఆదివాసీల మిత్రులు

ఆదివాసీల సంరక్షణ కోసం హేమల్కాశలో1973లో ప్రారంభించిన లోక్ బిరదారీ ప్రకల్ప్ ప్రకాశ్ ఆమ్టే సారథ్యంలో పోరాటం చేస్తోంది. ఓ చిన్న పూరి పాకలో ఆస్పత్రిలా మొదలైన 'ప్రకల్ప్' ఆదివాసీలకు విద్యనూ పరిచయం చేసింది. సరైన ఆచ్ఛాదన లేని మదియా గోండులను వైద్యుల్ని, టీచర్లను, ఇంజినీర్లను చేసిన ఘనత ప్రకల్ప్‌దే. డాక్టర్ ప్రకాశ్ భార్య మందాకినీ తోడుగా నిలవడంతో ఆ దండకారణ్యంలో ఆధునికతకు ఆనవాళ్లు వేశారు ప్రకాశ్. మలేరియా, లివర్ సిర్రోసిస్, విష జ్వరాలతో బాధలు పడుతున్న గోండులకు అధునాతన వైద్య సేవలను అందించింది ప్రకల్ప్. ఏటా 40 వేల మంది రోగులకు చికిత్సనందిస్తోన్న ప్రకల్ప్‌లో ప్రకాశ్ కొడుకు, కోడళ్లు డాక్టర్ దిగం మరాఠిలో అక్షరాలు నేర్పి వారి భాషా వికాసానికి పునాదులు వేసింది. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వ్యవసాయం, యంత్రశాస్త్రాల్లో ప్రాక్టికల్ శిక్షణనిచ్చి అభివృద్ధిలో తోడ్పడుతోంది. వేల మంది గోండులకు తొలిసారి పలకా బలపం పట్టించిన ఈ పాఠశాల బాధ్యులుగా మరో కొడుకు, కోడళ్లు అనికేత్, సమీక్షలు ఉన్నారు. ఇంటర్ వరకు చదువులు చెప్పే ఆ విద్యాకేంద్రం ఏటా 600 మందికి పైగా గోండులను విద్యావంతులను చేస్తోంది. వీరిలో 40 శాతం మంది కుటుంబంలో అక్షరం నేర్చిన తొలితరమే. ప్రకల్ప్‌లో మరో విశిష్టత అనాథ జంతువుల శరణాలయం 'ఆమ్టే ఆనిమల్ ఆర్క్'. వేట, దాడుల్లో గాయపడిన వన్యమృగాల సంరక్షణ కేంద్రమిది. సుమారు 80 వరకు జంతువులు ప్రస్తుతం అక్కడ సేద తీరుతున్నాయి. చిరుతలు, సింహాలు, మొసళ్లు, తాచులు వంటి ప్రమాదకర ప్రాణులు కూడా ప్రకాశ్ సాన్నిహిత్యంలో స్నేహంగా మెలుగుతాయి. ఉన్నత చదువులు చదివి విలాసవంతమైన జీవితాల్ని కాదనుకుని అడవి తల్లికే అంకితమైన ప్రకాశ్ కుటుంబం, నగరంలోనే ఉంటూ కూడా కుష్టు రోగుల ఆనందవనాన్ని విడవని వికాస్ కుటుంబం త్యాగాలు, విలువలు, ఆదర్శాలు బాబా ఆమ్టే స్ఫూర్తిని అజరామరం చేశాయి. అతి సామాన్య జీవనశైలితో మరో అసమాన్య తరాన్ని తయారుచేస్తున్నాయి ఆ కుటుంబాలు. ✦

నేను సోనాలి...

బీద కుటుంబంలో పుట్టిన బంగారం సోనాలి. పదిహేడేళ్ల ప్రాయపు కలలకు ... ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఆశలకు నిలువెత్తు రూపం. చదువులోనే కాక ఆటల్లోను ఎన్సీసీలోనూ ముందుండేది. సైకాలజిస్టు కావాలని తపన పడేది. అలాంటి సోనాలి కలలను ముగ్గురు మృగాళ్లు యాసిడ్ పోసి మాడ్చి మసి చేసేశారు. రంగురంగుల స్వప్నాలకు చిరునామాలైన ఆమె కళ్లు శాశ్వతంగా వెలుగును కోల్పోయాయి. అందరూ వున్న ఒంటరిగా చీకట్లో మగ్గుతున్న ఆమెకు స్నేహ హస్తం చాచాడు చిత్తరంజన్. అంతటితో సరిపుచ్చుకోక... తన హృదయ సామ్రాజ్యపు పట్టపు రాణిని చేశాడు. ఈ కథ కాని కథ పూర్తి వివరాలు తెలియాలంటే జార్ఖండ్ రాష్ట్రం... ధన్‌బాద్‌లోని సోనాలి మాటలు వినాల్సిందే.

ఈ భూమండలం మీద నేను జన్మించాను. నా ద్వారా నా తల్లితండ్రులు మళ్ళీ జన్మించారు. వాళ్ళు పసిపాపలై నాతో ఆడుకున్నారు. వాళ్ళు మళ్ళీ జీవించారు. నేనూ నా తల్లితండ్రుల లాగా జీవించాలనుకుంటున్నాను. మీ అందరిలాగే జీవితాన్ని పండించుకోవాలనే కాంక్షకి కాస్తంత దూరంలో ఉన్నాను.. నాపట్ల నా తల్లితండ్రులు కన్న కలలని సాకారం చేయాలనుకున్నాను. అవును! అప్పుడు నా జీవితం కోసం నేనొక కల కనే దిశలో ఉన్నాను. నేనొక సాకారం కాని స్వప్నాన్ని! నాపేరు సోనాలి!

నాకప్పుడు పదిహేడేళ్ళ వయసు. అది 2003వ సంవత్సరం. ఏప్రిల్ నెల. ముగ్గురు ముష్కరుల లైంగిక దాడిని ప్రతిఘటించానని వాళ్ళు నామీద పగ పెంచుకున్నారు. నెలన్నర తరవాత ఒకరోజు వాళ్ళు మా ఇంటికి వచ్చారు. బలవంతంగా నా మొహంమీద యాసిడ్ పోశారు. తిరగబడదామంటే కంటికి ఏమీ కనపడలేదు. కళ్ళంతా మంట. మొహం 75శాతం కాలిపోయింది. డాక్టర్లు నా ముఖానికి 28 క్లిష్టమైన సర్జికల్ ఆపరేషన్లు చేసారు.

గత పదేళ్ళుగా స్వేచ్ఛ, ఆత్మబలం కోసం నా సర్వశక్తులన్నీ కూడదీసుకుంటూనే ఉన్నాను. ఎవరికీ కనపడకుండా అందరికీ దూరంగా ఒంటరిగా ఉంటూ వచ్చాను. ఎంత దూరంగా ఉండాలనుకున్నా పత్రికలూ, వార్తా చానళ్లూ నన్ను ఒదిలేవి కాదు. ఎంతోమంది శ్రేయోభిలాషులు జాలి, సానుభూతి చూపే వాళ్ళు. కాని చిత్తరంజన్ అలా కాదు. అతడు నాకొక ప్రత్యేకమైన శ్రేయోభిలాషి. 2013వ సంవత్సరంలో ఒకరోజు అతడు నన్ను టీవీలో చూసాడు. అతడొక ఎలక్ట్రికల్ ఇంజనీర్.మొదట పరిచయం చేసుకున్నప్పుడు అతడు కొన్ని స్నేహపూర్వక వాక్యాలు వినిపించాడు. పరిచయం తరువాత మేమిద్దరం అప్పుడప్పుడూ కలుసు కునేవాళ్ళం. అతడు తరచు నాతో గంటలతరబడి ఫోనులో మాట్లాడుతుండేవాడు. కాలక్రమేణా మేమిద్దరం మంచి స్నేహితుల మయ్యాం. పోయిన సంవత్సరం ఉన్నట్లుండి ఒకరోజు అతను మా పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పుడు నివ్వెరపో యాను. ఆ దుర్ఘటన తర్వాత నేను కలలో సైతం ఊహించని ఘటన అది. మొదట అతను నన్ను పెళ్ళి చేసుకుంటాను అన్నప్పుడు షాక్‌కు గురయ్యాను. నేను ఆలోచించుకోవాలి అన్నాను. ఆ తరువాత “నువ్వు నన్నెందుకు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నావు? నేను అనాకారిని, నాకు చూపు లేదు” అని చెప్పాను. అతడు వినలేదు. ‘భార్యాభర్తలలో ఎవరికైనా ఏదన్నా అనుకోనిది జరిగితే వాళ్ళు ఎందుకు విడిపోతారు? ఒకరికి ఒకరు ఆసరా ఇచ్చుకుంటూ బతుకుతూనే ఉంటారు. మనమూ అలానే అనుకో’ అన్నాడు చిత్తరంజన్. అంతేకాక నేను తనకి తగిన పరిపూర్ణ స్త్రీని అని కూడా చెప్పాడు. అది నన్ను మరింత ఆశ్చర్యపరిచింది. నాకు పెళ్ళౌతుందని కలలో కూడా ఊహించలేదు. జీవితాంతం ఒంటరిగా బతకడానికి సిద్ధపడి ఆ దిశగా నన్ను నేను నిర్మించుకునే క్రమంలో ... నన్ను అర్థంచేసుకునే చిత్తరంజన్ నా జీవితంలోకి వచ్చాడు. చిత్తరంజన్ సున్నిత మనస్కుడు. నా తల్లితండ్రులతో మాటాడి వాళ్ళని పెళ్ళికి ఒప్పించాను. మాది పూర్తిగా చట్టబద్ధమైన వివాహం, మా నాన్న తరువాత నన్ను చక్కగా చూసుకుంటున్నాడు. కలలో సైతం ఊహించని తృప్తి నా సొంతమైంది. అంతకంటే ఇంకేం కోరుకోగలను నేను!?

భర్తతో...

దాడికి ముందు

ఆమె కళ్ళు కసిగా కవ్విస్తాయి.
ఆమె కళ్ళు ముసిముసిగా నవ్విస్తాయి.
ఒక్కోసారి నిప్పులు చెరుగుతాయి.
ప్రేమ మైకంలోనూ ముంచెత్తుతాయి.
ఆమె గొంతు ఖంగుమంటూ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.
ఎంతటి నటులైనా ఆమె ముందు చతికిలపడేలా చేస్తుంది.
ఆమె మనుసులో వున్నదే మాట్లాడుతుంది. ఆమె చెయ్యాలనుకున్నది చేసేస్తుంది. ఆమె పేరే గరికపాటి వరలక్ష్మి. సౌత్ ఇండియన్ ప్రేక్షకులకు జి.వరలక్ష్మిగా పెనవేసుకున్న పేరు.

పొగరు వగరు కలిసిన నటి

ఆంధ్రప్రదేశ్ ఒంగోలులో 1926లో జన్మించిన వరలక్ష్మి తన పదకొండవ ఏటనే నాటకల్లో నటించాలన్న ఉత్సాహంతో ఇంట్లో చెప్పాపెట్టకుండా పారిపోయింది.
ఆ రోజుల్లో తుంగల చలపతి, దాసరి కోటిరత్నం ఇద్దరూ ప్రసిద్ధ రంగస్థల నటులు. "రంగూన్ రౌడీ, సక్కుబాయి" చిత్రాలు ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తున్న సందర్భం అది. వారి ప్రభావం జి. వరలక్ష్మి మీద పడింది. తన పన్నెండవ ఏటనే బారిస్టరు పార్వతీశం, బొండాం పెళ్లి చిత్రాల్లో నటించింది. హెచ్.ఎమ్.రెడ్డి, రఘుపతి ప్రకాశ్ ఈమెను ప్రోత్సహించారు. అప్పట్లో నౌషద్ గారి పాటలంటే పడిచచ్చేవాళ్ళు. జి. వరలక్ష్మి 'నౌషద్' ట్రూపులో చేరి పాటలు పాడేసి గొప్ప గాయనీమణి అయిపోవాలన్న కలలు కనేది. అనుకున్నదే తడవుగా బొంబాయి వెళ్ళిపోయింది.
అతి చిన్న వయసులో సినీ పరిశ్రమలో ప్రవేశం... పైగా తప్పొప్పులు చేప్పేవాళ్ళు ఎవరూ లేరు. తన మనసులో మెదిలే ఏ పనైనా దూకుడుగా చేసెయ్యడం... ఎదురు దెబ్బ తగిలితే రాటుదేలడం... ఇదే నేర్చుకుంది. అయితే దేవుడిచ్చిన గొప్పవరం తెగింపు, సాహసం.. నిర్మొహమాటం..ఈ త్రిగుణాలు ఆమెను ఆకాశానికి ఎత్తాయి. పాతాళానికి తొక్కాయి. బొంబాయిలో కోరస్ పాడే అవకాశాలను కూడా చేజిక్కించుకోలేక 1946లో తిరిగి చెన్నపట్నం వచ్చేసింది.జి.వరలక్ష్మిలోని అమాయకత్వం, పొగరు, ధైర్యం ఇవన్నీ కె.యస్.ప్రకాశరావుని ఆకర్షించాయి. కె.యస్ ప్రకాశరావుతో (ప్రకాశ్ స్టూడియో అధినేత, రాఘవేంద్రరావు తండ్రి, దర్శకుడు) కలిసి "ద్రోహి" చిత్రంలో నటించింది. ఇందులో జి. వరలక్ష్మి స్వభావానికి తగ్గ పాత్ర అది. యూనిట్‌లో వారందర్నీ ఏడిపించేది. ఒక్కోసారి తనకు కావల్సింది ఇవ్వకపోతే మొండిగా వ్యవహరించి మంకు పట్టు పట్టేది. ఇది ప్రకాశరావు మనసుని హత్తుకుంది. జి.వరలక్ష్మితో పెళ్ళికి దారి తీసింది. జి.వరలక్ష్మికి స్టార్‌డమ్ వచ్చేసింది.

మరపురాని చిత్రాలు

జి.వరలక్ష్మిని ఒక పాత్రకి ఎంపిక చేసుకున్నారంటే దానికి రీప్లేస్‌మెంట్ లేదు. కీలుగుర్రం, శ్రీలక్ష్మమ్మ కథ చిత్రాలలో ఆ విషయం తేటతెల్లమైంది. ఆ రోజుల్లో శ్రీలక్ష్మమ్మ కథ ఘన విజయం సాధించిన చిత్రంగా చెప్పుకొనేవారు. స్వప్న సుందరి, దీక్ష (ప్రకాశరావు దర్శకత్వం), నిరపరాధి, పెళ్ళి చేసి చూడు చిత్రాలతో స్టార్‌డమ్ వచ్చింది. కన్నతల్లి, నా చెల్లెలు, జ్యోతి, మా గోపి, మేనరికం, గులేబకావళి, దొంగల్లో దొర, రాజనందిని, మాంగల్య బలం, ఇద్దరు మిత్రులు, కులగోత్రాలు, భీష్మ, అంతస్తులు, సుమంగళి, ఆస్తిపరులు, లేత మనసులు, బంగారు పిచుక, బుద్ధిమంతుడు, నిండు హృదయాలు, సంసార సాగరం, గంగ- మంగ, అత్తవారిల్లు, గోరంత దీపం, ఈ చిత్రాలను చూసిన ప్రేక్షకులెవరూ జి.వరలక్ష్మి నటనను మరిచిపోలేరు. దర్శక నిర్మాతలూ ఆమె మనసుని అర్థం చేసుకొనే పాత్రలు ఆఫర్ చేసేవారు. ఒకసారి కమిట్ అయితే జి.వరలక్ష్మి అంకిత భావం ఇంతా అంతా కాదు. ప్రొడ్యూసర్ కష్టసుఖాల్లో పాలు పంచుకొనేది. ఆమె మాటకి ఎవరూ ఎదురు చెప్పరు. ఒకవేళ చెప్పినా ఆమె వినదు. ఈ విషయంలో ప్రకాశరావు గారికి జి.వరలక్ష్మికీ మధ్య అభిప్రాయ బేధాలొచ్చాయి. అయినా ఒకరికొకరు సంపూర్ణంగా గౌరవించుకునేవారు.
యాభయ్యవ దశకంలో కమ్యూనిస్టు పార్టీ తరపున గట్టిగా నిలబడిన నటి జి.వరలక్ష్మి. ఎల్డామ్స్ రోడ్‌లో పెద్ద భవనం. అందులో గొప్పవారికి ఎంత స్థానం వుందో పేదవారికీ అంతే స్థానం వుండేది. పేద, ధనిక, కుల, మత తారతమ్యాలుండేవి కావు. ఎదుటి మనిషిని ఇట్టే స్కాన్ చేసేయ్యగల శక్తి సంపన్నురాలు జి.వరలక్ష్మి. ఎవరు ఎంతటి ప్రమాద స్థితిలో ఉన్నా వారికి అభయమిచ్చి బాధల్ని కొని

'ద్రోహి'లో కోన ప్రభాకరరావుతో...

తెచ్చుకొనేది. అలాగే ఆమె జీవితంలో చేసుకున్న స్వయం కృతాపరాధాలెన్నో. తను చేసిన తప్పుని నిర్భయంగా ఒప్పుకొనేది. ఇదే ఆమెలో అరుదైన వ్యక్తిత్వం. తనతో సరిసమానంగా అందర్నీ గౌరవించడం ఆమె ప్రత్యేకత.

దర్శక నిర్మాత

తన మనసులో రగులుతున్న భావాలన్నింటిని నిక్షిప్తంగా కథలల్లి "బంగారు సంకెళ్ళు, మూగజీవులు" చిత్రాలను నిర్మించింది. బంగారు సంకెళ్ళు చిత్రానికి బి.రామినీడు దర్శకత్వం వహించగా, మూగజీవులు చిత్రానికి జి.వరలక్ష్మి దర్శకత్వం వహించింది. ఈ చిత్రాలు ఆ రోజుల్లో భారీ వ్యయంతో నిర్మించినా మూస కథలతో వచ్చిన చిత్రాలకు అలవాటు పడిన ప్రేక్షకులకు ఈ రెండు చిత్రాలూ రుచించలేదు. బంగారు సంకెళ్ళు చిత్రంలో బుర్రకథ సన్నివేశంలో జి.వరలక్ష్మి ప్రదర్శించిన నటన మరిచిపోలేం.

ఆగిపోయిన 'పోరాటం'

జి.వరలక్ష్మి జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవలసి వచ్చింది. కుటుంబ కలహాలు... ఒక మాటిస్తే ప్రాణం పోయినా ఆ మాటని నిలబెట్టుకోవడం... తను నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణాలకు సైతం తెగించి పోరాడేందుకు వెనుకాడకపోవడం ఆమె జీవిత గమనంపై ప్రభావం చూపేవి. ఈ నేపథ్యంలోనే విక్టరీ భార్య సరోజినితో కథ, ఆత్రేయ గారితో విప్లవాత్మక పాటలు రాయించి "పోరాటం" అని ఆ చిత్రానికి నామకరణం చేసింది (మాటలు తనే రాసుకొంది). ఇది 2000లో మాట. అప్పటికే చిత్ర నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. మంచి సాంకేతిక నిపుణులు అందుబాటులో లేరు. మంచినీళ్ల ప్రాయంగా డబ్బు ఖర్చయిపోతుంది. పోరాటం సినిమా మొదలుపెట్టినా అది నిర్విఘ్నంగా జరగదు. అలాగని ఒకరిని సాహాయం అడగటం అస్సలు ఇష్టముండేది కాదు. కొంత కాలం మానసికంగా సంఘర్షణ అనుభవించింది. ఆమెకు అతి ముఖ్యమైన స్నేహితుల మాట మీద పోరాటం చిత్రాన్ని అర్ధాంతరంగా ఆపేయవలసి వచ్చింది.

నిజాయితీ నిర్భయాలకు నిలువెత్తు నిదర్శనం

జి.వరలక్ష్మి అంటేనే నిర్భయం. జి. వరలక్ష్మి అంటేనే నిజాయితీ. మాట తేడా వస్తే ఎంతటి వాడ్నయినా కాలరు పట్టుకొని నలుగురిలో ప్రశ్నించేది. ఆర్థికంగా ఎంత చితికిపోయినప్పటికి భర్త కూడా ఆమెను ఆదరించలేదు. ఆమె తరుచూ ఆత్మీయులతో...అంటుండేది. 'నాలాంటి మనస్తత్వం ఆడవాళ్లకి వుండకూడదు. ఈరకమైన మొండితనం అన్ని వేళ్ళలా మంచిది కాదు. ఒక్కోసారి ఊహించని ప్రమాదంలో పడతాము. అది చూసి పది మంది సహచరులు పండగ చేసుకుంటారేగాని చేయూతనివ్వరు. అయితే నిప్పులా బతికాను. నిజాయితీగా వున్నాను. బతికినంతకాలం నిర్భయంగా వున్నాను. ఈ జీవితానికి ఈ తృప్తి చాలు!'.

ఇమంది రామారావు
9010133844

తెలుసా!

ఎవరెస్టు పర్వతం ప్రతి సంవత్సరం 4 మిమీ పొడవు పెరుగుతుంది.

ప్రతి సంవత్సరం డిసెంబరు 11 తేదీన ఇంటర్నేషనల్ మౌంటెన్ డే జరుపుకుంటాం.

వేలి ముద్రకు లాగానే నాలుక మీది గీతలు కూడా ఏ ఇద్దరివీ కలవవు.

ఒక్కో వెంట్రుక జీవిత కాలం 3 నుంచి 7 సంవత్సరాలు.



శరీరంలోని ఇతర భాగాల్లో కంటే ముఖం మీది వెంట్రుకలు వేగంగా పెరుగుతాయి.

మానవ మెదడు పగటిపూట కంటే రాత్రుళ్లు ఎక్కువ చురుగ్గా వుంటుంది.

ఒక అడుగు వేయడానికి 200 కండరాలను ఉపయోగిస్తాం.

జడలు వేస్తున్న నాన్నలు

అమ్మ జడ వేయడం కామన్. అదే నాన్న వేస్తే! వండర్! నమ్మశక్యంగా లేదు కదూ. అయితే అమెరికాలోని డెన్వర్‌లో మగవాళ్ళకు జడలు వేయడం నేర్పించే శిక్షణా కేంద్రం గురించి తెలుసుకోవాల్సిందే. తండ్రులు కూతుళ్ళకు జడ వేయడంలో శిక్షణ పొందుతున్నారు. అందుకోసం 55 డాలర్లు చెల్లిస్తున్నారు. ఇక్కడ పోనీ టెయిల్, ముడి, జడ వేయడం నేర్పిస్తారు. అయితే ఇంతటితో అయిపోదు. పోటీలు, విజేతలకు బహుమతులు కూడా ఉంటాయి. ఇంత గొప్ప ఆలోచన క్యాలి అనే మహిళదే. ఒక రోజు క్యాలీ భర్త వ్యాపార భాగస్వామి సమావేశానికి రావలసిన సమయం కంటే ఆలస్యంగా వచ్చాడట. ఇంటి దగ్గర తన కూతురికి జడ వేయవలసి రావడమే ఆ ఆలస్యానికి కారణం. సరిగ్గా ఆ సందర్భంలోనే జడలు వేయడంలో మగవారికి శిక్షణ ఇవ్వాలన్న ఆలోచన వచ్చింది. అంతే! మొదలెట్టేశారు. అన్నట్టు పోటీల్లో గెలుపొందిన నాన్నలకు బీర్ ఇస్తారు. డాడ్ బీర్‌తో ఖుషీ అయితే...డాటర్ నాన్న వేసిన జడతో హ్యాపీ.

వింత లోకం

చేప ఎముక చిత్రాలు

చేప ఎముకలతో చిత్రాలు వేస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తునాడు లిన్ హన్ బింగ్ అనే చైనా చిత్రకారుడు. చేపముళ్ళతో అందమైన కళాఖండాలను రూపొందించడమే కాక... తన కళతో సామాజిక, పర్యావరణ అంశాలపై అవగాహన కూడా కలిగిస్తున్నాడు. విశ్వవిద్యాలయంలో హస్తకళలమీద పట్టా తీసుకున్నాక చేపల ముళ్ళు, ఎముకలతో ప్రయోగాలు ప్రారంభించాడు. మనం పనికిరాని చెత్తగా భావించి పడేసే చేపముళ్ల అతనికెంతో విలువైనవి. రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి వాటిని పెద్ద మొత్తంలో సేకరిస్తుంటాడు. ఇలా పోగు చేసిన వాటిని దశలవారీ శుభ్రపరచి చిత్రకళకు ఉపయోగిస్తుంటాడు. ఈ చేపముళ్ల గోడవేంట్రా బాబూ అనిపిస్తుంది కదూ ఇదాంతా చదువుతుంటే. కానీ అతని కంటికి చేపల ఎముకలు ఎంతో అందంగా కనిపిస్తాయి. వాటిలో మాటల్లో చెప్పలేనంత కళాత్మకత ఉంటుందట. వాటినుంచి పొందిన ప్రేరణతోనే ఈ చిత్రకళను ప్రారంభించాడతను. ఇప్పటివరకు వెయ్యికిపైగా చిత్రాలు రూపొందించాడు. మొదట్లో చేపముళ్లతో చిత్రాలు వేయడం మొదలెట్టిన కొత్తలో కొందరైతే ఇతన్ని చూసి నవ్వారు కూడా. అప్పులు చేసి బతకాల్సి వచ్చేది. అలాంటిది ఇవాళ ఒక ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేసి వేలాదిమంది కళాప్రియుల అభినందనలు అందుకుంటున్నాడు. సేకరించిన చేపల ఎముకలు, ముళ్ళు కొన్ని టన్నులు ఉంటాయి. ప్రస్తుతం తను నేర్చుకున్న ఈ విద్యని తరువాతి తరాలకు అందిచే పనిలో ఉన్నాడు.



కురువృద్ధుడికి కళ్లజోడుతో పనిలేదు

జపాన్‌కు చెందిన నూటపన్నెండేళ్ళ యషుతరో కొయిడేని ప్రపంచంలోనే అత్యధిక వయసుగల వృద్ధుడిగా గిన్నిస్‌బుక్ గుర్తించింది. కొయిడే 1903 సంవత్సరంలో మార్చి 13న జన్మించాడు. దర్జీగా పనిచేసిన కొయిడే ఇప్పుడు ఇంత వయసులో కళ్ళజోడు లేకుండా ఏదయినా చదివేయగలడు. ఇప్పటి వరకు ప్రపంచంలో అత్యధిక వయస్కుడయిన సకారి మొమాయ్ నూట పన్నెండేళ్ళ వయసులో గతించడంతో ఇప్పుడు కొయిడేనే ప్రపంచంలో అత్యధిక వయసుగల వృద్ధుడయ్యాడు. తన ఆరోగ్య రహస్యం అతిగా మందు, పొగ తాగకపోవటం కాదట. తనకెంతో ఇష్టమయిన బ్రెడ్డును మాత్రమే తినడమేనట.

నవ్వుల్ – పువ్వుల్

కళ్లు మూసుకుని

హరి: రాము ఎందుకు కళ్లు మూసుకుని పాట పాడుతున్నాడు..?

గిరి: అతని మనస్సు చాలా మెత్తనిది. అతని గొంతు వింటున్న శ్రోతల బాధ చూడలేకే అలా కళ్ళు మూసుకున్నాడు.

ఐదు మార్కులు

టీచర్: ఒరేయ్ చంటి! నీకొచ్చింది ఐదు మార్కులు. సిగ్గు లేకుండా ఇంకా నవ్వుతున్నావా?

చంటి: ఆ ఐదు మార్కులు కూడా ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు టీచర్. నేను రాసింది సినిమాలోని పాట కదా...!

హచ్ కుక్క

డాక్టర్: కుక్క వెంటపడుతుంటే తప్పించుకోకుండా ఏం చేస్తున్నారు?

వెంగళప్ప: హచ్ కుక్కేమో అనుకున్నా. కరిచాక తెలిసింది పిచ్చి కుక్క అని...

హోటల్ డాక్టర్

"**ఈ** డాక్టర్ గతంలో ఏదైనా హోటల్లో పనిచేసి ఉండాడని నా నమ్మకం"

"**ఎ**లా చెప్పగలవు"

"**ఇం**జెక్షన్ చేయించుకున్నాక డబ్బులు లేవంటే క్లినిక్‌లో టవల్స్ గట్రా ఉడికించాడ్రా మరి"

ముందుగా

ఆ..ఏవోయ్ వెంకట్రావ్! రాత్రి ఎనిమిదైంది. అసలే కొత్తగా పెళ్లైనవాడివి. ఇంటికి వెళ్ళాలనిపించడం లేదా? ఇంకా పని చేస్తూనే ఉన్నావు? మెచ్చుకోలుగా అన్నాడు ఆఫీసర్.

ఏం లేదు సార్. మా ఆవిడ కూడా ఉద్యోగం చేస్తుంది. ముందుగా ఎవరైతే ఇంటికి చేరుతారో వాళ్ళు వంట చేయాలి రహస్యంగా చెప్పాడు వెంకట్రావు.

ఫటాఫట్

ఉన్నోడు ఐ-ఫోన్ కొనిస్తాడు
లేనోడు ఐస్-క్రీమ్ తినిపిస్తాడు
కాసులు ఉన్నోడు కార్లలో తిప్పుతాడు
పైసలు లేనోడు పానీపూరి తినిపిస్తాడు..
ప్రెజెంటేషన్ లోనే తేడా... ప్రేమలో కాదు.

సిగ్గు

సిగ్గులేదటయ్యా నీకు? కూరలు తరుగుతుంటే వేలు తెగిందని సెలవు కావాలంటున్నావా? ఆ మాట అనడానికి నీకు నోరెలా వచ్చిందయ్యా? అరిచాడు ఆఫీసర్

నిజం సార్. నిజంగానే వేలు తెగింది. వినయంగా అన్నాడు జగదీష్

గత పాతిక సంవత్సరాలుగా కూరలు తరుగుతున్నాను. ఒక్కసారి కూడా తెగలేదు. కనీసం గోరు కూడా తెగలేదు. అండర్ స్టాండ్ ఇంకా పెద్దగా అరిచాడు ఆఫీసర్.

ఐరన్ టాబ్లెట్

మధు: అదేంటి? టాబ్లెట్లని అలా అయస్కాంతం దగ్గర పెట్టావ్?

గోపి: డాక్టర్ గారు నాకిచ్చినవి ఐరన్ టాబ్లెట్ అని అన్నారు పరీక్షిద్దామని!

రహస్యం

భజగోవిందం మీద ఆవేశంతో ఊగిపోతున్నాడు ఆంజనేయులు.

అసలేమిటి మీ ఉద్దేశ్యం నేను అవినీతిపరుడినని, తాగుబోతునని నా మీద ఊరందరికీ చెబుతున్నారట!

క్షమించండి సార్... ఇవన్నీ రహస్యాలని ఇంతవరకూ నాకు తెలియదు చల్లగా అన్నాడు ఆంజనేయులు.

స్వాహా

తెలుగు రాష్ట్రాన్ని చేశారు రెండు ముక్కలు
ఆంధ్ర, తెలంగాణా అంటూ
సామాన్య ప్రజల మధ్య పెట్టారు చిచ్చు
రెండు కోతులు పిల్లి సామెతలా
ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారారు.
సామాన్యుని బతుకులో మార్పు లేదు
అధికారంలోకి రావటానికి...
ఓటర్లకి వేసారు ఎన్నో "ఎర"లు వాగ్దానాలు
రైతన్నలకు రుణ మాఫీ ఉచిత విద్యుత్
డ్వాక్రా మహిళలకు రుణాలు...
పేదలకు పక్కా ఇళ్ళు...
ఎన్ని సార్లు మోసపోతున్నా..
నమ్ముతూనే ఉంటారు... అమాయక జనం
అదే నేటి (వి)నాయకులకు వరం
గద్దెనెక్కించారు పచ్చ చొక్కాలను
రావటమే.. నూతన రాజధాని అంటూ
రైతన్నల పొలాలు భోజ్యం
రైతుల రుణమాఫీలకు షరతులు..
పక్కా ఇళ్ళ బ్రాండ్ మారింది...ఒకప్పుడు
ఇందిరమ్మ ఇళ్ళు.... ఇప్పుడు ఎన్.టి.ఆర్ ఇళ్ళు
ఆరోగ్య శ్రీ ...ఫీజు రీ ఎంబర్స్‌మెంట్
అటకెక్కాయి
పాలకులు... కార్పొరేట్ కళాశాలలకు,

హాస్పటల్‌కు
దాసోహం..అంతా సూట్‌కేసుల మాయాజాలం
ఇసుక కుంభకోణాలతో సామాన్య ఉద్యోగస్థుల
బలి
ర్యాగింగ్‌ల "ఉరి" తాళ్ళకు వేలాడుతున్న
విద్యార్థిలోకం
అయినా చర్యలు శూన్యం
ఢిల్లీ నుంచి గల్లీదాకా ఆడపిల్లలపై అరాచకాలు
నిర్భయ చట్టాలు కాగితాలకే పరిమితం
కోట్లు దండుకోవటానికి వెలసిన పబ్‌లు, క్లబ్‌లు
ఇదేమని ప్రశ్నించని మానవ హక్కుల సంఘాలు
మాదక ద్రవ్యాలు,ఇంటర్‌నెట్‌లు, అసభ్య ఛానళ్ళు
అశ్లీల చిత్రాలు ..ఈ విష వలయంలో
బలవుతున్న యువత
సామాన్యుని వ్యథలను పట్టించుకోని
అధికార పక్షాలు
సామాన్యుని బలహీనతలతో కోట్లు
దండుకుంటున్న వ్యాపారులు
దళారుల దోపిడికి బలవుతున్న నిరుపేదలు
నిత్యావసరాలు ....ఆకాశంలో షికార్లు
అయినా పట్టించుకోని పాలకులు
ఉల్లి పేరు వింటేనే మండుతున్న కళ్లు
ఇరుసు లేని బండిలా ...సామాన్యుని జీవనం
ఎన్ని స్వాతంత్ర్యాలు వచ్చినా... మారని
సామాన్యుల బ్రతుకు 'చిత్రం'
వామనావతారంలా రాజకీయ బకాసురలతో....
నిండుతున్న భూమాతని చూసి....
విలపిస్తోంది..భరతమాత
పేదవాడికి పట్టెడన్నం పెట్టలేని చేతులు
తిరుపతి వెంకన్న హుండీలను కోట్లతో
నింపుతున్నాయి...
అన్నార్తుల ఆకలితీర్చలేని పాపులు...
కనకదుర్గమ్మకి లక్షల విరాళాలు
నాయకుల స్వార్థం బండరాయిని దేవుడిని
చేసింది....

- సిహెచ్.వి.యస్. బ్రహ్మానందరావు
9573147109

నెగళ్లు

పోడు మీద పొడిచే పచ్చని పొద్దులా..
అడవి మీద ఎగిరే పావురాల గుంపులా
స్వేచ్ఛగా.. సహజాతి సహజంగా..వాళ్లు!
వన్య ప్రాణులతో ఆటలాడుతూనో..
అడవి పిట్టలతో పాట పాడుతూనో..
యీ కొండకోనల్లో ప్రవహించే
స్వచ్ఛమైన సెలయేటి వాగుల్లా...వాళ్లు!
వాళ్లకు, కడుపుల్లో పోడు కాలినప్పుడు
గంటికూర నంజుకొని చింతంబలో..
టెంకంబలో..జుర్రడం తెలుసు!
అరారగా ఆకుల దొన్నల్లోని పుల్లేర్లు యేరుకుని
పల్లీలు తిన్నట్టు ఒలుచుకు తినడం తెలుసు!
యీవలేసినపుడు, కుందేటి పిల్లలతో కలిసి
యేట్లో మూతి పెట్టి తాగడం తెలుసు!
అమృతవృక్షం జీలుగు చెట్టు మీంచి
అపుడే దించిన కల్లు కడుపారా తాగి
అడవి తల్లి ఒడిలో కంటి నిండా నిదురోవడం
తెలుసు! వెదురు చాపల మీద మావుళ్ల

రసాలారబోసి
తాండ్రజేసి, లోకం నోళ్లను తీపిచేయడం తెలుసు!
పుట్టతేనె తీసి బొంగుల్లో పిండుకోవడం తెలుసు!
విప్పపూల చెట్టెక్కి
పిల్లన గోవితో పాటలపందిళ్లు వేయడం తెలుసు!
పున్నమిరాత్రుల్లో వెన్నెల చెట్టుకింద
కిన్నెర మీటుతూనో.. తుడుంకొడుతూనో...
థింసాలాడడం తెలుసు!
గూడేల ముందు తచ్చాడే నెమలిపిట్టలతో కలిసి
ఆటలాడుకోవడం తెలుసు!
అడవిని కావుళ్లకెత్తుకొని
వారపు సంతల్లో అమ్ముకోవడం తెలుసు!
అంతేనా..
వాళ్లకు, అడవి నుంచి వీచే పోరుగాలికి
నెగళ్లై రగలడం తెలుసు!
వాళ్ల తునికాకు కావుళ్లను దోచుకునేటందుకు
కాటాను తొక్కిపడుతున్న కాలిబొటనవేళ్లను
ఖండించడం తెలుసు!
అడవిని అప్పనంగా దోచుకుపోతున్న లారీల
చుట్టూ
మానవహారంలా మూగడం తెలుసు!
పన్నగాలు పసిగట్టి
కొండల్ని మింగేస్తున్న ఉక్కుపడగల మీద
విల్లమ్ము లెక్కుపెట్టి
అమ్మలాంటి అడవిని కాపాడుకోవడమెలాగో
వాళ్లకు బాగానే తెలుసు!

-స్వామినాయుడు
9494010330

ఇక్కడ రుతుక్రమం గురించి బహిరంగంగా మాట్లాడటం అదో పెద్ద నేరం. పురుషుడు అయితే వీటి చర్చలో నిషిద్ధం. స్త్రీలు గుసగుసల తోనే దాన్ని ఓ భూతం చేసేశారు. అంతే నిగూఢతే మహిళలకు శాపం అవుతోంది. శుభ్రమైన నాప్కిన్‌లు వాడక ఇన్‌ఫెక్షన్‌లు సోకి ఎన్నో గర్భధారణ సమస్యలకు కారణమవుతోంది. దీనిపైనే స్పందించి శానిటరీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు సంపాదించాడు అరుణాచలం మురుగనాథన్.

శానిటరీ పురుషుడు

పెద్ద కంపెనీల బ్రాండెడ్ శానిటరీ నాప్కిన్‌ల ఖర్చు ఓ పేద కుటుంబానికి గుదిబండే. అంతగా చదువురాని, గ్రామీణ మహిళలకు వాటి మీద అవగాహన తక్కువే. ఇంటింటికీ టీవీలు చేరినా శానిటరీ నాప్కిన్ల వారిచ్చే యాడ్స్‌లో ఏం చెబుతున్నారో అర్థంకాని వారు చాలామందే. అందుకే భారత్‌లో వాటిని వాడని మహిళలు 88 శాతం మంది. పాఠశాల చదువులు ఆపేసేవారు 12 శాతం పైబడే. అటు ఖర్చు, ఇటు అవగాహన లోపంతో పాటు సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్ల పేరిట సహజ విషయాన్ని అసహజం చేసేశారు. మహిళలకు మాత్రమే అని బోర్డు తగిలించుకున్న ఈ సమస్యపైనే స్పందించాడు అరుణాచలం మురుగనాథన్. అతి తక్కువ ఖర్చుతో శానిటరీ నాప్కిన్‌లు తయారుచేయాలని కంకణం కట్టుకున్నాడు. ఆడాళ్ల వెక్కిరిస్తే, మగాళ్లు పక్కకు తప్పుకున్నారు. దెయ్యాలు పట్టాయని రెండు కాళ్లూ వేలాడదీసి చింత బరికెతో వదిలించేలోపు తేరుకుని ఆ ఊరు నుంచి బయటపడ్డాడు. ఇన్ని అవమానాలు, వ్యథలు ఎదురైనా తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన అరుణాచలం ముందుకు సాగడానికి కారణం భార్య ద్వారా అతని దృష్టికి వచ్చిన రుతుచక్రం సమస్య. తాను బండిని కూడా తుడవడానికి ఇష్టపడని క్లాత్‌ను ఆమె ఉపయోగించడం గమనించి విస్తుపోయాడు. ముట్టుకుంటేనే రోగాలు వస్తాయనుకునే పాత చీలికలనే వారు ఉపయోగిస్తారని తెలుసుకున్నాడు. కొన్ని చోట్ల రంపపు పొట్టు, బూడిద, మట్టి, ఇసుక వంటి వాటిని ఉపయోగిస్తారని తెలుసుకునేసరికి నిద్ర పట్టలేదు. తన భార్యకు ఎక్కడ లేనిపోని రోగాలు వస్తాయనే భయంతో శానిటరీ నాప్కిన్‌లు కొనితెచ్చాడు. తొలిసారి కొన్నప్పుడే జేబుకు చిల్లుపడేసరికి నెలనెలా ఎలా అనే ప్రశ్న తలెత్తింది. ఆ నాప్కిన్‌లను తేరిపార చూశాక అవి దూదిని పోలి ఉండటంతో అంత అధిక ధరలెందుకో అర్థం కాలేదు. తానే ఎందుకు వాటిని ఇంట్లో తయారుచేయకూడదని పని మొదలెట్టాడు. ఇంటిలో వారు వాటిని వాడి పనికిరావని చెప్పారు. వారిని ఇబ్బంది పెడుతున్నాడని గ్రహించి తానే ఓ గర్భసంచి వ్యవస్థను రూపొందించి పరీక్షించాడు. ఫుట్‌బాల్ బ్లాడర్‌గా, జంతు రక్తాన్ని వాడి ప్రయోగాలు చేశాడు. వాటిని ధరించి సైకిల్ తొక్కేవాడు. అవి విఫలమై ఊరివారి చీత్కారాలు పొందేవాడు. భార్య విడిచిపెట్టేసింది. ఇలా రెండేళ్లు గడిచాక నాప్కిన్‌లలో వాడేది మామూలు దూది కాదని పైన్ సెల్యులోజ్ ఫైబర్‌తో తయారుచేస్తారని తెలుసుకున్నాడు. దాన్ని విశ్వప్రయత్నం చేసి సేకరించాడు. మెటీరియల్ సమస్య తర్వాత మరో సమస్య నాప్కిన్‌ల మార్చే మెషీన్లకు లక్షలు ఖర్చు అవుతాయి. అవి బయటి దేశాల నుంచి తెచ్చుకోవాలి. అంత స్థోమత లేదు. తానే మెషీన్‌ను రూపొందించే పనిలో పడ్డాడు. అరుణాచలం 14 ఏళ్లకే కుటుంబ అవసరాల దృష్ట్యా చదువు మానేశాడు. ఫుడ్ సప్లయర్, కూలీ ఇలా ఎన్నో పనులు చేస్తూ వెల్డర్‌గా, మెషీన్ ఆపరేటర్‌గాను పనిచేశాడు. ఆ అనుభవమే అక్కరకు వచ్చింది. తన నైపుణ్యానికి పదును పెట్టి మెషీన్‌ను విజయవంతంగా రూపొందించాడు. కేవలం 65 వేలకే అందుబాటులోకి తెచ్చాడు. తొలుత స్థానిక మెడికల్ కాలేజీ విద్యార్థినులకు ఉచితంగా అందించాడు. వారి ద్వారా గ్రామస్తులకు వివరించాడు. అలా ఒక్కో గ్రామంలో వాటి వాడకాన్ని అలవాటు చేస్తూ చివరకు మహిళలే స్వంతంగా కుటీర పరిశ్రమ పెట్టుకునేలా చైతన్యం తెచ్చాడు. స్వయం సహాయక మహిళలకు మెషీన్ల వాడకాన్ని నేర్పి వాటిని పెద్ద ఎత్తున తయారీ చేయించాడు. లాభాపేక్ష లేకుండా మెషీన్లను అందించాడు. చాలా పారిశ్రామిక వేత్తలు లాభాలు ఆశచూపిన లొంగలేదు. బాగా వెనుకబడిన ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ గ్రామాల్లో విస్తృతంగా తిరిగి తయారీ కేంద్రాలను పెంచడమే కాక మహిళలు ఆరోగ్యకర అలవాట్లను పాటించేలా ప్రచారం చేశాడు. మహిళల ఆదాయం ఆరోగ్యంపై మంచి ప్రభావాన్ని చూపింది ఆయన కృషి. అలా ఇప్పుడు 23 రాష్ట్రాల్లో 1300 గ్రామాల్లో ఈయన మెషీన్లను ఉపయోగించి నాప్కిన్లను తయారుచేస్తున్నారు. కొన్ని బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లోను వీటిని ఏర్పాటుచేశాడు. శానిటరీ నాప్కిన్లను వాడితే కళ్లు పోతాయని, పెళ్లి కాదని దురభిప్రాయాలపై కూడా పోరాటం చేశాడు. ఐఐటీ, ఐఐఎంలు, హార్వార్డ్ లాంటి అంతర్జాతీయ సంస్థల ఆయనకు వేదికను ఏర్పాటుచేశాయి. తొలుత ఏంచేస్తున్నాడో అర్థం కాక భయంతో దూరమైన భార్య వెనక్కువచ్చి బలాన్నిచ్చింది. భారత ప్రభుత్వం పలు అవార్డులతో సత్కరించింది. ఆయన కృషికి స్పందించి తక్కువ ధరకే శానిటరీ నాప్కిన్లు అందించే ప్రాజెక్టును రూపొందించినా అరుణాచలానికి చోటివ్వలేదు. అయినా ఆయన అసంతృప్తి చెందలేదు. తన మిషన్‌ను అంతర్జాతీయం చేసుకున్నాడు. సుమారు 106 దేశాల్లో తన మెషీన్లను పరిచయం చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే చాలా వరకు పని పూర్తి చేశాడు. నైజీరియా, కెన్యా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ఆయన మెషీన్లు పెద్ద మార్పే తెస్తున్నాయి. విప్లవాత్మక ఆ ఆవిష్కారంతో ఎంత కూడబెట్టారని అడిగితే అంత మంది మహిళల ఆరోగ్యం, సంతోషం అని బదులిస్తాడు. అందుకే ఆయన్ను శానిటరీ మేన్ ఆఫ్ ఇండియాగా ప్రపంచం పిలుచుకుంటోంది. ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ తల్లి తన కూతురు అరుణాచలం ఆవిష్కరణ వల్ల బడికి వెళ్లగలుగుతోందని ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపింది. అంతకన్నా అమూల్యమైంది తన జీవితంలో లేదని ఆయన గర్వంగా చెబుతాడు.

- జెఎస్పీ

మన తెలుగు వారి సంక్రాంతి కేరళ తీరంలో ఓనమ్‌లా విరబూస్తుంది. త్రై.. త్రై.. తకత్రై అంటూ నాగపడవల రోహకుల హోరు. పులి పూనకం వచ్చి పులిక్కలి నృత్యకారుల గర్జనలు. పంటల పండగను చాలా ప్రత్యేకంగా నిర్వహించుకుంటారు కేరళవాసులు. వర్ణశోభితంగా, సంప్రదాయకంగా సాగే ఓనమ్ ఉత్సవాల్లో నాగ పడవ పోటీలు, పులిక్కలి నృత్య ప్రదర్శనలను వీక్షించేందుకు ప్రపంచ నలు మూలల నుంచి సందర్శకులు తరలివస్తారు.

కేరళ కాంతులు

కేరళను పడవ ప్రయాణాలను విడదీసి చూడలేం. వెనీస్‌లో కన్నా గొప్పగా ఉంటుంది ఇక్కడ విహారం. పక్క ఊరికి వెళ్లాలన్నా, పంట దిగుబడి తరలించాలన్నా అక్కడ పడవల్లోనే సాగుపోతుంది జీవనం. అంతలా జీవితాల్లో అంతర్భాగమైన పడవలకు అక్కడి ఉత్సవాల్లోను పెద్ద పీట వేస్తారు కేరళీయులు. ప్రతి సందర్భంలోను వాటి సేవలను గుర్తిస్తూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటుచేశారు.

పర్యాటకంలో కేరళను ఒడ్డుచేర్చింది అబ్బురమైన ఈ పడవ ప్రయాణమే. ఈ పడవల్లోను కేరళలో మాత్రమే చూడగల నాగపడవలు ప్రత్యేక ఆకర్షణ సంతరించుకున్నాయి. వందకు పైగా అడుగుల పొడవుండే ఈ పడవల ఆకృతే చాలావిస్తుగొలుపుతుంది. పడగ విప్పిన సర్పాకారంలో కనిపించే ఈ పడవలకో విశిష్టత ఉంది. చుందన్ వాల్లంగా మళయాళంలో పిలుచుకునే ఈ పడవలు ఓనమ్ వేడుకల్లో దర్శనమిస్తాయి. 1972 నుంచి ప్రతి ఏటా వీటి పడవ పందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను చూడటానికి వేలాది మంది పథనంతిట్ట జిల్లాలోని ఆరన్‌మూల పంపా నది తీరానికి తరలివస్తారు. వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆరన్‌మూల పార్థసారథి కోవెల నిర్వహించే ఓనమ్ ఉత్సవాల్లో భాగంగా నాగపడవల పోటీలు జరుగుతాయి. ప్రత్యేకంగా కనిపించే ఈ నాగపడవల వాడుక వెనుక వందల ఏళ్ల కథ ఉంది. ఆరన్‌మూల పార్థసారథి కోవెలలో కొలువైన కృష్ణార్జునులకు తిరువోన సద్య ఉత్సవంలో భాగంగా రకరకాల వంటకాలతో నైవేద్యాన్ని తిరువోన తోని అనే పడవలో కట్టూరు నుంచి సాయంత్రం 6 గంటలకు పంపిస్తారు. ఈ పడవను ఆరన్‌మూల కోవెలకు తర్వాతి రోజు ఉదయం 4 గంటల కల్లా జాగ్రత్తగా చేర్చేందుకు ఆ పడవ మార్గంలో ఉన్న గ్రామాల వారే బాధ్యత తీసుకుంటారు. ప్రతి గ్రామం వారు శక్తివంతమైన భారీ నాగ పడవలను నిర్మించుకుని రక్షణగా సాగుతారు. ఇలా పదుల గ్రామాల వారు దళంగా ఏర్పడి రక్షణనిస్తారు. ఈ నాగపడవల సామర్థ్యం చాలా ఎక్కువ. చాలా వేగంగా దూసుకుపోతూ బలిష్టంగాను ఉంటాయి. 100 నుంచి – 138 అడుగుల పొడవుండే నాగపడవల వెనుక భాగం 20 అడుగుల ఎత్తు ఉంటుంది. 12 అడుగుల తెడ్డులను పడవ నడిపేందుకు ఉపయోగిస్తారు. ఈ పడవల తయారీకి అంజిలి అనే వృక్షపు కలపను వినియోగిస్తారు. బంగారు వర్ణంలోని లేసుతో అలంకరిస్తారు. తెల్లటి ధోవతి, తలపాగాతో పడవ నడిపేవారి వస్త్రధారణ ఉంటుంది. కేరళ గొడుగులకు అలంకారాలు చేసి పడవ మధ్యలో అమరుస్తారు. తెడ్డు వేసే వారిని ఉత్సాహపరిచేందుకు గాయకులు ఉంటారు. వారు కుచేల వృత్తంలోని వంచిపట్టు గీతాన్ని పాడుతుంటారు. దానికి తగ్గట్టు తెడ్డువేస్తారు. ఉత్సవంలో చివరగా నాగ పడవ పోటీల్ని నిర్వహిస్తారు. వీటిలో 40 నుంచి 50 గ్రామాలకు చెందిన పడవలు పాల్గొంటాయి. వీటిని నడిపేవారిని చాలా గౌరవ, మర్యాదలతో చూసుకుంటారు. వీరికి 68 రకాల వంటకాలతో భారీ ప్రత్యేక విందులు ఏర్పాటు చేస్తారు.

ఇలాంటివి 254 విందులు వరకు ఉంటాయి.

ఈ పోటీల్లో గెలిచినా, ఓడినా పెద్దగా తేడా ఉండదు. సంప్రదాయంలో భాగంగానే చూస్తారు. ఈ వేడుకను చూసినవారు మళ్లీ ఓనమ్ నాటికి అక్కడ వాలిపోతారు.

పులి ఖేళీ..

పులిక్కలి అనే సంప్రదాయ నృత్యం ఓనమ్ పండుగ మరో ప్రత్యేకత. కేరళ అంతటా వీరి ప్రదర్శనలు కనిపించినా త్రిస్సూరులో మాత్రం చాలా భారీస్థాయిలో నిర్వహిస్తారు. అసలీ నృత్యానికి ప్రాణం పోసింది త్రిస్సూరే. రెండు వందల ఏళ్ల క్రితం అప్పటి రామవర్మ శక్తన్ తంపురాన్ అనే మహారాజు ఈ వేడుకలను ప్రారంభించారు. పులి వేట వృత్తాంతంతో తీవ్రతను ప్రతిబింబించేలా నృత్యాన్ని తీర్చిదిద్దారు. ప్రదర్శకులు వారి ఒంటిపై పులి, సింహం, చిరుత వంటి మృగాల రూపాలను వేయించుకుంటారు. వీటిని చిత్రించేందుకు ప్రత్యేక కళాకారులుంటారు. ఒక్కొక్కరికి సుమారు 6 గంటల సమయం పడుతుంది. ఒళ్లంతా ఎరుపు, నీలం, నలుపు, పసుపు రంగుల్లో ముఖ్యంగా పొట్టభాగంలో మృగాల నోరును చిత్రించుకుని వాటిని కదుపుతూ నృత్యం చేస్తారు. జింకను వేటాడే పులి, దానిని తరిమే వేటగాడు ఇలా పాత్రలు ఉంటాయి. వీటిని వీధి మార్గాల్లో ఉడుక్కు, తకీల్ వాద్యాలకు అనుగుణంగా ప్రదర్శిస్తూ పట్టణం మధ్యలోని స్వరాజ్ క్షేత్రంలోకి అడుగుపెడతారు. మార్గం పక్కన వేలాది మంది వీక్షకులు వారి హోరుతో ప్రదర్శకులను ఉత్సాహపరుస్తుంటారు. వడక్కునాథన్ గణపతి ఆలయానికి చేరుకున్న బృందాలు భీకరంగా నృత్య ప్రదర్శన చేస్తాయి. పులి వేషధారణ, నృత్య తీరుకు పోటీలు ఉంటాయి. ఈ జానపద నృత్యాన్ని సంరక్షించేందుకు 2004లో పులిక్కలి కమిటీ ఏర్పాటైంది. త్రిస్సూరు ప్రభుత్వం ప్రతి బృందానికి పారితోషికాలు అందిస్తుంది. ఈ నృత్యాల్ని ప్రదర్శించే కళాకారుల పొట్ట ఆకారం, అనుభవం ఆధారంగా విలువ పెరుగుతుంది. మృగాలు గర్జిస్తున్నట్టు పొట్ట భాగాన్ని కదపడమే కీలకం. ఈ ప్రత్యేక జానపద నృత్యాన్ని వీక్షించేందుకు వేలాదిమంది త్రిస్సూరుకు చేరుకుంటారు. ఈ పులిక్కలి ఖేళీలో మరో ప్రత్యేకత సమీప గ్రామాల ప్రజలు ప్రభలను ఊరేగింపుగా స్వరాజ్ క్షేత్రానికి తీసుకువస్తారు. గణపతి కోవెల వద్ద వాటిని ప్రదర్శిస్తారు. సప్తవర్ణాలతో మునిగిపోయినట్టుండే ఆ ప్రాంగణం ప్రపంచ నలుమూలల నుంచి సందర్శకులను ఆకర్షిస్తోంది. పథనంతిట్ట, త్రిస్సూర్‌లో నిర్వహించే ఓనమ్ వేడుకలు కేరళ ఉత్సవాలకు సింబాలిక్‌గా నిలుస్తున్నాయి. సంతోషాల్ని పరివారాల్లో నింపుకుని ప్రజలు కలిసిమెలసి మధురానుభూతులను పంచుకోవడమే వీటి లక్ష్యం. ఈసారి కొన్ని సంక్రాంతి కాంతులను కేరళ నుంచి కూడా తెచ్చుకోండి. ✦

పేదవాడి ప్రేమ చిహ్నం



అజరామరమైన తమ ప్రేమకు గుర్తుగా మొఘల్ చక్రవర్తి షాజహాన్ తాజ్‌మహల్ కట్టించడం జగద్విదితం. ప్రపంచ అపురూపమైన కట్టడాలలో తాజ్‌మహల్ ఒకటి. ఈ కట్టడం నాలుగు వందల సంవత్సరాల నాటిది. అయితే తమ ప్రేమ సైతం షాజహాన్ ముంతాజ్‌ల ప్రేమకు ఏమాత్రం తీసిపోదంటున్నాడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఫైజల్ హసన్ ఖాద్రి. మరణించిన తన భార్య తాజాముల్లి కోసం ఓ బుల్లి తాజ్‌మహల్ నిర్మిస్తున్నాడు.

77 సంవత్సరాల ఫైజల్ ఒక రిటైర్డు పోస్టల్ ఉద్యోగి. 1953 సంవత్సరంలో తాజముల్లి బేగంతో అతడి వివాహమైంది. వాళ్ళకు పిల్లలు లేరు. 60 సంవత్సరాల అన్యోన్య దాంపత్య జీవితం తర్వాత గొంతు కాన్సర్‌తో తాజముల్లి ఫైజల్‌ను ఒంటరివాడిని చేసి ఈలోకాన్ని విడిచిపెట్టింది. పిల్లలు లేని కారణంగా మరణానంతరం తమను గుర్తుపెట్టుకునేవారెవరూ లేరని ఆఖరి క్షణాల్లో ఆమె బాధపడడం ఫైజల్‌ను నిత్యం వెంటాడుతుండేది. భార్య జ్ఞాపకాలతో రోజులు నెట్టుకొస్తున్న అతనికి ఒక ఆలోచన వచ్చింది. భార్యపై తనకున్న ప్రేమకు గుర్తుగా ఏదైనా చేయాలనుకున్నాడు. ఆలోచన వచ్చిందే తడవుగా మొదట ఆగ్రా వెళ్ళి ముంతాజ్ కోసం షాజహాన్ కట్టించిన తాజ్‌మహల్ పరిశీలించాడు. తనూ అచ్చం అలాంటిదే తన భార్యకోసం నిర్మించాలనుకున్నాడు.

ఇందుకోసం ఫైజల్ తనకున్న కొంత భూమిని, భార్య నగలను అమ్మేశాడు. ఇప్పటి వరకు పదకొండు లక్షల రూపాయలు ఖర్చు చేశాడు. ప్రధానమైన నిర్మాణం పూర్తయింది. ఇంకా కొంత కట్టడపు పని, మార్బుల్ పరవడం, చుట్టూ ఆకుపచ్చని తోట వంటి పనులు మిగిలి ఉన్నాయి. ఇంకొక ఆరేడు లక్షల వరకు ఖర్చు ఉంది. ఫైజల్ కథ విని చాలా మంది సహాయం చేస్తామని ముందుకు వచ్చారు. ఫైజల్ కడుతున్న ఈ కొత్త తాజ్‌మహల్ గురించి విన్న ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కొంత ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అతడు ఎవరినీ సహాయం అడగడం లేదు. తనకు వస్తున్న కొద్దిపాటి పెన్షన్‌తో మిగిలిన పని పూర్తిచేయగలనన్న నమ్మకంతో ఉన్నాడు. ఇంతేకాదు! ఆ పక్కనే చిన్న ఇల్లు కట్టుకుని ప్రతిరోజూ తాజ్ వంక చూస్తూ జీవిస్తున్నాడు. మరణానంతరం భార్య సమాధి పక్కనే తనను ఖననం చేయమని కోరుతున్నాడు. అందుకోసం ముందే ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు.

మన ఆధునిక జీవితం పరుగులు పెట్టమంటుంది. మనుషులపై మనకున్న ప్రేమ ఒక్కసారి ఆగి చుట్టూ చూడమంటుంది. ఫైజల్ షాజహన్ లాగా చక్రవర్తి కాకపోవచ్చుకాని ...పల్చబడుతున్న మానవ సంబంధాల మధ్య అతడి ప్రేమకు నిలువెత్తు సాక్ష్యమా కట్టడం. కాదనగలమా..! ✦

భార్య ఫోటోతో ఫైజల్ షాజహన్

యుద్ధ కళా ఖండం

కలరిపాయట్టు

పంచభూతాల్ని ఆధారం చేసుకుని సాధన చేసే భారతీయ యుద్ధ కళలు బాహ్య, అంతర్గత శక్తులపై ప్రభావం చూపి సూపర్ హ్యూమన్‌ల స్థాయికి కళాకారులను చేరుస్తాయి. కుంగ్ ఫూ, కరాటే వంటి ఆసియా యుద్ధ కళల్లో మిళితమైన దక్షిణాసియా మూల యుద్ధ కళగా పేరొందిన అతి ప్రాచీన కలరిపాయట్టు దక్షిణ భారతావనిదే. చైనాలో పుటి డామో, వియత్నాంలో బోది డట్‌మా, జపాన్‌లో బొద్దై దరుమా, కొరియాలో పోరి దల్మాగా కొలుస్తున్న షావోలిన్ ఆత్మరక్షణ విద్య ఆద్యుడు బోధి ధర్ముడు దక్షిణ భారతీయుడే. ప్రపంచంలోనే అతి పురాతనమైన మార్షల్ ఆర్ట్‌గా డాక్యుమెంట్ కాబడిన మల్లయుద్ధం మనదే. ఎన్నో దాడులను తట్టుకుని నిలబడిన భారతీయ మార్షల్ ఆర్ట్స్ ఇప్పుడు నిరాదరణ అనే స్వదేశీయుల మౌన యుద్ధంలో కనుమరుగు కాబోతున్నాయి.

అజయ్ కుమార్ వారాల
9502395077

ఆధునిక మార్షల్ ఆర్ట్స్‌కు క్రేజ్ తెచ్చిన బ్రూస్ లీ సైతం అభిమానించే మల్లయోధుడు గామా భారత ఖండానికి చెందినవాడే. ఇంగ్లండ్ సామ్రాజ్యమే గౌరవించిన ఓటమినెరుగని మరో మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడు తెలుగు యోధుడే. ఇండో-ఆర్యన్ వలసలకు ముందే వేళ్లూనుకున్న మల్ల యుద్ధ కళకు ఎన్నో ఆధారాలు లభించాయి. వేల ఏళ్ల క్రితం నుంచి నేటి ఆధునిక యుద్ధకళల్లో భారత ముద్ర ప్రత్యేకం. ప్రాచీన గ్రంథాలైన వేదాలు, పురాణాల్లోను వీటిని సవివరంగా వివరించారు. మార్షల్ ఆర్ట్స్ ఉనికికి సంబంధించి రాతపూర్వకంగా ఉన్న ఆధారం ప్రాచీన సంగం రచనల్లో కనిపిస్తుంది. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దం నుంచి క్రీ.శ. రెండో శతాబ్దం వరకు గ్రంథస్తమైన సంగం సాహిత్యంలోని అకనానురు, పురానానురుల్లో మార్షల్ ఆర్ట్స్ గురించి ప్రస్తావనే కాదు ఆయుధాలు, పద్ధతుల గురించి విపులమైన చర్చే ఉంది. ఆసియా యుద్ధ కళలకు తల్లివేరుగా, అతి ప్రాచీనమైనదిగా చెప్పుకుంటున్న కళరిపాయట్టుకు ఇవే బీజ కళలు. సంగం సాహిత్యంలోనే 'శిలప్పాదికారమ్' అనేది శిలంబం యుద్ధ కళ ప్రాధాన్యతను వివరిస్తుంది. విదేశీ యాత్రికులను రప్పించిన దీని విన్యాసాలను పొగుడుతూ వారి ప్రాచీన యాత్రా గ్రంథాలున్నాయి. పురాతత్వ కళాఖండాలు, ప్రాచీన కట్టడాలు, దేవాలయాలు, గుహాలయాలు, యుద్ధ స్మారకాల్లో ప్రాచీన భారత యుద్ధ కళలకు సంబంధించిన శిలా విన్యాసాలు అనేకం కనిపిస్తాయి.

పరాక్రమానికి సాక్ష్యాలెన్నో...

హర్ష చక్రవర్తి కాలంలో యాత్ర సాగించిన చైనా సన్యాసి యువాన్‌జాంగ్ గ్రంథస్తం చేసిన ఓ ఘటన

హుయెన్ లాంగ్లాన్

బోధిధర్ముడు

చైనాలో బౌద్ధ ధర్మాన్ని వ్యాపింపజేసిన మహా బౌద్ధుల్లో బోధిధర్ముడు ఒకరు. చాన్ బుద్ధిజాన్ని చైనాకు బోధించాడు. బుద్ధుని నుంచి నేరుగా మతాధిపతిగా వచ్చిన 28వ, చివరి మహామునిగా ఆయనకు స్థానం కల్పించారు. క్రీ.శ.5, 6 శతాబ్దాల కాలానికి చెందినవాడిగా చైనా గ్రంథాలు చెబుతున్నాయి. దక్షిణ భారత్‌కు చెందిన ఓ గొప్పరాజుకు మూడో కుమారుడని టాన్లిన్ వేల ఏళ్లనాటి గ్రంథంలో రాసి ఉంది. టిబెట్ గ్రంథాలు నలుపు శరీర ఛాయ కలిగిన ద్రావిడ ముని అని పేర్కొన్నాయి. లంకావతర సూత్రాలను పాటించే ఆయన జెన్ నీతుల్ని ఇండోనేషియా, సుమత్రా, జావా, బాలి, మలేషియాల్లో ప్రవచిస్తూ చివరికి చైనాకు చేరారు. ఆయనకు అతీంద్రియ శక్తులను ఆపాదిస్తూ ఎన్నో ఊహాతీత కల్పనలతో చైనా జానపదాల్లో సాహిత్యం ఉంది. మార్షల్ ఆర్ట్స్‌కు పవిత్ర స్థలంగా విరాజిల్లుతున్న షావోలిన్ ఆలయంలో ధ్యానమూ, యుద్ధ కళలను అభివృద్ధి చేసింది బోధిధర్ముడేనని చైనా సాహిత్యం పేర్కొంటుంది. 'ఎముక మూలగ, కండర రూపాంతర విద్య' అనే అంతర్గత సాధన, 'పద్దెనిమిది ముని చేతుల' వ్యాయామాలను బౌద్ధమునులకు నేర్పించాడని రచనలు చెబుతున్నాయి. మలై దేశాలకు సిలాత్ అనే యుద్ధ కళను అందించింది ఆయనేనని మలేషియా సాహిత్యం చెబుతుంది. చైనా, జపాన్, కొరియా, తైవాన్‌లలో ఆయన్ను దైవంగా కొలుస్తారు. యిజిన్ జింగ్, జిస్యు జింగ్ అనే గ్రంథాలను ఆయన రచించారు. యిజిన్ జింగ్ ప్రతుల నకళ్లు ఇప్పటికీ భద్రంగానే ఉన్నాయి. జిస్యు జింగ్ మాత్రం అదృశ్యమైంది. బోధిధర్ముడే మరికొన్ని ప్రాచీన గ్రంథాలు రచించాడని అంటారు. బోధిధర్ముని మూలాలు దక్షిణ భారత్‌వి కావని ప్రచారం చేసేందుకు పెద్ద ప్రయత్నమే జరిగింది. కానీ, వేయి ఏళ్ల నాటి గ్రంథాలు బోధిధర్ముని ద్రావిడ మూలాల్ని రూఢి చేశాయి.

యుద్ధ కళల ఉనికి ఏపాటిదో వివరిస్తుంది. హత్యాయత్నాన్ని నిలవరించి ఆగంతకుడిని హర్షుడు చాకచక్యంగా ప్రాణాలతో పట్టుకున్న ఆ ఘటనలో ఆయన కదిలిన వేగం, మెరుపులాంటి స్పందన గురించి యువాన్‌జాంగ్ ప్రస్తావించాడు.

ఇండో-ఆర్యన్‌ల వలసలకు పూర్వమే నాలుగు రూపాల్లో మల్ల యుద్ధాన్ని క్రోడీకరించారు. మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించిన వివరాలు ధనుర్వేద సంహిత, అగ్ని పురాణం, అర్థశాస్త్రం, సారంగధర పద్ధతి, నీతి వాక్యామృత, భోజుని యుక్తికల్పతరు, సోమేశ్వర-3 మానసోల్లాస వంటి శాస్త్ర గ్రంథాలతోపాటు బౌద్ధ, సిక్కు, జైన గ్రంథాల్లోను కనిపిస్తాయి.

నేటి భారత్, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, బర్మా, పాకిస్తాన్‌లలో విస్తరించిన యుద్ధకళలన్నింటినీ భారత యుద్ధ కళలుగానే ప్రస్తావిస్తారు. గట్కా, హుయెన్ లాంగ్లాన్, కళరిపాయట్టు, మర్దానీ ఖేల్, శిలంబం, స్క్యే, ముష్టి యుద్ధం, మల్ల యుద్ధం, పెహల్వానీ, వజ్ర ముష్టి, వర్మ కళ, వంటి ప్రధాన స్రవంతి విద్యలు నేటికీ మనుగడ సాగించగలుగుతున్నాయి. యుద్ధ కళలులానే కాక నృత్య రూపకాలుగా అవి రూపాంతరం చెందాయి. కథాకళి సూక్ష్మ కదలికల మెరుగుదలకు కళరిపాయట్టును కళాకారులు నేర్చుకుంటారు. ఈశాన్య రాష్ట్రాల చ్చౌ అనే నృత్య రూపకం కేవలం మార్షల్ ఆర్ట్స్ కళాకారులు మాత్రమే చేయగలరు. మార్షల్ ఆర్ట్స్ అనేవి కేవలం క్షత్రియులకే పరిమితం కాదని మిగతా వర్గాలు కూడా విస్తృతంగా సాధన చేశాయని ఉద్యోదనసూరి కువలైమాల గ్రంథం ఆధారంగా నిలుస్తోంది. 8వ శతాబ్దికి చెందిన ఈ గ్రంథంలో ఉపఖండవ్యాప్తంగా ఎన్నో పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్‌ను అనేక వర్గాల విద్యార్థులకు నేర్పించినట్టు వివరించారు. అయితే బౌద్ధం విస్తరించిన భారత్‌లో శాంతికాముకత పరిఢవిల్లి క్రమంగా యుద్ధ కళల్ని నిరుత్సాహపరిచేందుకు కృషి జరిగిందని చరిత్రకారులు అంటారు. కంధకుని కాలంలో ముష్టియుద్ధం, మల్ల యుద్ధం, ధనుర్విద్య, కత్తిసాములు నిషేధించినట్టు తెలుస్తుంది.

దక్షిణాన ప్రకాశం

ప్రాచీన యుద్ధ కళల్ని కంటికి రెప్పలా కాచుకున్నది దక్షిణ భారతమే. క్రీ.శ. 630ల కాలానికి చెందిన పల్లవ రాజు నరసింహవర్మన్ పదుల కొద్దీ యుద్ధ కళలకు సంబంధించిన గ్రానైట్ శిల్పాలను చెక్కించాడు. వీటిలో సాయుధ సైనికులను నిరాయుధులను చేస్తున్న స్థానిక యుద్ధ కళాకారుల పాటవాన్ని అందులో మలిచారు. చేర, చోళ రాజ్యాల మధ్య చాలా కాలం పాటు సాగిన యుద్ధ వాతావరణం వల్ల యుద్ధ కళలకు అమిత ప్రాధాన్యం లభించింది. విజయనగర రాజ్యస్థాపన తర్వాత వీటికి మరింత ఆదరణ పెరిగింది. ఈ కాలంలో స్త్రీలూ మార్షల్ ఆర్ట్స్‌లో రాణించారు. మల్లయుద్ధం, ముష్టియుద్ధం, ఖడ్గ, ధనుర్విద్యల్లో సత్తా చాటేవారు. యుద్ధ కళల్ని నేర్పే సాముగరిడీలు చాలా చోట్ల ఉండేవి. ఆ కాలంలో రాత్రి భోజనానికి ముందు ఈ గరిడీల్లో సాధన చేసేవారని, ముదుసలి వారూ 30ల వయసున్న వారిలా కనిపించేవారని కొన్ని విదేశీ యాత్రికుల గ్రంథాల్లో రాయబడింది. ఇటలీ యాత్రికుడు పీట్రో డెల్లా వాల్లె దక్షిణాదిలో అదీ తెలుగు జనసామాన్యంలోను విశేషంగా కనిపించే కర్రసాము సాధన గురించి తన యాత్రాపుస్తకంలో వివరించాడు.

ఉత్తరాన వికాసం

ఉత్తర భారత్‌లో 'శస్త్ర విద్య' పేరిట 10 రకాల యుద్ధ కళలుండేవని చరిత్రకారుల చెబుతారు. ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో ఉన్న 'తక్షశిల' ప్రాచీన విశ్వవిద్యాలయ కేంద్రంగా ఈ శాస్త్రవిద్యలు పరిణామం చెందాయని చెబుతారు.ఈ భారతీయ యుద్ధ కళల్ని మొఘలాయిలు స్వీకరించారు. అక్బర్ పాలనలోనే ఔసానస ధనుర్వేద సంకలనం రచించారు. తమ సైన్యానికి రాజ్‌పుత్‌ల యుద్ధ కళల్ని అన్వయింపజేశారు. ఐన్-ఈ-అక్బరీ గ్రంథం దేశం నలుమూలలకు చెందిన యుద్ధ కళా నిపుణులు రాజాస్థానంలో ఉండేవారని చెబుతోంది. ఒంటి చేత్తో శత్రువును మట్టి కరిపించే 'ఏక్ హాత్' అనే కళ గురించి, తూర్పు ప్రాంతాలకు చెందిన 'చిర్వా' అనే చిన్న డాలు గురించి, దక్షిణాది ప్రాంతాల్లో ఉపయోగించే మనిషిని, గుర్రాన్ని కప్పేసే భారీ డాలు 'తిల్వా' గురించి ప్రత్యేకంగా పేర్కొంది. ఛత్రపతి శివాజీ కాలంలో మర్దానీ ఖేలా పునరుజ్జీవనం పొందింది. 'శివ సూత్ర' గ్రంథంలోని గెరిల్లా యుద్ధ తంత్రాన్ని ఉపయోగించి ఓ మహా రాజ్య స్థాపన ఈ యుద్ధ కళల ద్వారానే సాధ్యమైంది.

బ్రిటీష్‌పై పోరాడి..

కళింగ రాజ్యానికి వెన్నెముకలా నిలిచిన పైకా యుద్ధ వీరులు అఖాడాల ద్వారా దాని ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు. బ్రిటీష్ కాలనీల స్థాపనకు వ్యతిరేకంగా ఒడిషాలో పోరాడిన ఈ అఖాడాలు 1817 మార్చి నెలలో బక్షి జగబంధు బిద్యాధర్

చైనా షావోలిన్ టెంపుల్‌లో మార్షల్ ఆర్ట్స్ నేర్పుతున్నట్టుగా బోధి ధర్ముని చిత్రం (ఎడమ వైపు)

ఉత్తరప్రదేశ్‌లో లభించిన నవ శతాబ్ది మల్లయుద్ధ టెర్ర కోట నమూనా

ధనుర్విద్య

మహాపాత్ర నేతృత్వంలో ఓ భారీ ఉద్యమాన్ని లేవనెత్తింది. సుమారు 400 మంది పైకా యుద్ధకళా వీరులు గంజాంలోని ఘుముసర్ నుంచి ఖోర్దా వరకు మార్చ్ చేశారు. బ్రిటీష్ స్థావరాలపై విరుచుకుపడ్డారు. మిగతా ప్రాంతాల్లోనూ భారతీయ యుద్ధ కళావీరుల దాడి ఘటనల నేపథ్యంలో సంప్రదాయ యుద్ధ కళలపై బ్రిటీష్‌వారు నిషేధం అమలు చేస్తూ వచ్చారు. 1804లో కలరిపాయెట్టుపై తొలి నిషేధం అమలైంది. ఆ తర్వాత శిలంబం, పైకా అఖాడాలపై కూడా నిషేధం విధించి మిగతా యుద్ధ కళలకూ విస్తరిస్తూ పోయారు. ఇది యుద్ధ కళల సాధనకు పెద్ద ఎదురుదెబ్బలా మారి దాదాపు అదృశ్యమయ్యే స్థితికి వెళ్లిపోయాయి. కొందరు గురువుల ధైర్య సాహసాలు, ఆశయాలు, పట్టుదల, త్యాగాలతో కొన్ని యుద్ధ కళల్ని రహస్యంగా నేర్పిస్తూ వచ్చారు. అలా కలరిపాయెట్టు లాంటి అతి ప్రాచీన కళలు అంతర్ధానం కాకుండా మిగిలాయి. 1920లలో తెల్లిచెర్రిలో ఓ ఉద్యమంలా యుద్ధ కళల పునఃశోధన, పునరుత్తేజం సాగింది. దీన్ని స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా చూశారు. స్వాతంత్ర్యానంతరం వీటిపై నిషేధం తొలగిపోవడంతో మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణ దశ నుంచి బయటపడ్డాయి.

కలరిపాయట్టు

యావత్ ఆసియా యుద్ధ విద్యలలో పాకిపోయిన ఈ దక్షిణాది యుద్ధ కళ తమిళనాడు, కేరళతో పాటు కర్నాటక తులనాడులో కూడా కనిపిస్తుంది. క్రీ.పూ. 2వ శతాబ్దం నాటికే ఉన్నట్టు ఆధారాలున్న ఈ కళ తమిళనాట వందల ఏళ్ల పాటు అభివృద్ధి చెందింది. కేరళలో మరింత అభివృద్ధి చెంది మూడు ప్రధాన శైలులలో ప్రస్తుతం కొనసాగుతోంది. పాడ నాయర్లు, చెకవాల మలబార్ శైలి, నాడర్ల తిరువితన్‌కూర్ దక్షిణ శైలి, మధ్య కేరళ శైలిలో కొన్ని మార్పులుంటాయి. ఉత్తర శైలి కదలికలు, చాకచక్యమైన టెక్నిక్‌లు, ఆయుధాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తే, దక్షిణ శైలి బలమైన ప్రభావాన్ని చూపే టెక్నిక్‌లు, వట్టి చేత్తో దాడికి, మర్మ కేంద్రాలపై దృష్టి సారించింది. కలరిపాయట్టును 8 రకాల జంతువులను పోలిన టెక్నిక్‌లతో సాధన చేస్తారు. ఒక్కో పాఠశాల ఒక్కో టెక్నిక్‌కు ప్రాధాన్యతనిస్తుంది. ఒకే శైలిని భిన్న రకాలుగాను ఉపయోగిస్తుంది. కలరి అనే వీటి పాఠశాలల్లో యుద్ధ విద్యతో పాటు ఖగోళ, భూగోళ, సాంఘిక, గణితం వంటి శాస్త్రాల్లోను తర్ఫీదునిచ్చేవారు. రంగస్థల కళలకు కూడా ఇవి నిలయంగా ఉండేవి. ఆయుర్వేదానికి విలక్షణమైన దక్షిణాదికి చెందిన ప్రత్యేక వైద్యశాస్త్రం సిద్ధ వైద్యం ఇక్కడే మొదలైంది.

పైకా అఖాడా

ఒడిషాకు చెందిన ఈ కళ కళింగ రాజ్యా స్థాపన నాటికే విస్తృతంగా ఉండేది. రైతు దళంగా ఉన్న ఈ అఖాడాలు స్వతంత్రంగా మనుగడ సాగించేవి. యుద్ధ సమయంలో రాజ్యానికి సేవలను అందించేవి. వ్యాయామ శాలలైన అఖాడాల్లో ఈ కళ తర్వాతి తరాలకు చేరుతూ చాలా కాలం మార్పులు చోటుచేసుకోకుండా మనగలిగింది. ఒకప్పుడు కేవలం పురుషులకు మాత్రమే ప్రవేశమున్న ఈ విద్యను తర్వాత స్త్రీలకు నేర్పించారు. ప్రస్తుతం పైకా నృత్యరూపకంలో ప్రధానంగా వినియోగిస్తున్నారు. ఖండ, పట్ట వంటి ఖడ్గాలు ప్రత్యేకమైనవి. కళింగ మహోత్సవాల్లో భాగంగా అక్కడి విశ్వశాంతి స్థూపం వద్ద ప్రదర్శిస్తారు.

మల్లయుద్ధం

ఇండో-ఆర్యన్ జాతి చొరబాట్లకు ముందే మల్ల యుద్ధం భారత ఉపఖండంలో ఉంది. క్రీ.పూ. 5000 నాటికే మల్లయుద్ధం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన యుద్ధ కళ. ఆ తర్వాత ఎన్నో మార్పు చేర్పులు చోటుచేసుకుని అనేక రూపాల్లో ఇది తన మూలాల్ని వ్యాపించింది. భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలకు విస్తరించింది. ఇప్పటికీ ప్రాచీన మల్లయుద్ధ శైలి కర్నాటక, తమిళనాడుల్లో కనిపిస్తుంది. మల్ల యుద్ధంలో ప్రధానంగా చోటుచేసుకున్న మార్పు మొఘలుల కాలంలో జరిగింది. మల్లయుద్ధానికి, పర్షియా కోస్తీ పెహల్వానీని జోడించి కుస్తీగా అభివృద్ధి చేశారు. ముక్నా అనే మణిపూర్ రెజ్లింగ్ ఇంఫాల్, తౌబాల్, బిష్ణుపూర్‌లలో బాగా ప్రాచుర్యాన్ని పొందింది. బోలి ఖేలా అనే మరో రెజ్లింగ్ కూడా భారత్‌దే. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో బాగా ప్రాచుర్యం ఉంది ఈ కళకు. మిజోరాంకు చెందిన ఇన్‌బువాన్ అనే రెజ్లింగ్ శైలి దుంగ్‌త్లాంగ్ అనే గ్రామంలో 1750ల నుంచి వాడుకలోకి వచ్చింది. బందేశ్ అనే యుద్ధ కళ కూడా కుస్తీని పోలి ఉంటుంది.

ముష్టి యుద్ధం

పిడి గుద్దులతో ప్రత్యర్థిపై విరుచుకుపడే ముష్టి యుద్ధం దక్షిణాసియా బాక్సింగ్‌కు మూలం. ప్రస్తుతం వారణాసిలో మాత్రమే మూకి బాక్సింగ్‌లా మనుగడ సాగిస్తున్న ఈ మార్షల్ ఆర్ట్‌లో ఆయుధాలను ఉపయోగిస్తారు. ప్రస్తుతం పంజాబ్‌లో లోహ ముష్టిగా పిలవబడే బాక్సింగ్‌లో ఒక చేతికి ఉక్కు రింగు తొడికి బాక్సింగ్ సాధన చేస్తారు. అయితే ప్రాణాంతకం కావడంతో స్పారింగ్‌లో ధరించరు. వట్టి చేతులతో రాళ్లను, కొబ్బరికాయల్ని పగులకొట్టే స్థాయి వరకు ఏళ్ల తరబడి చేతులను రాటు దేలుస్తారు. వజ్ర ముష్టిగా పిలిచే మరో ఆయుధ బాక్సింగ్ శైలి కూడా ప్రాచీనమైన భారత యుద్ధ కళే. ఇంద్ర ముక్తిగాను

తెలుగు వీరులు

ప్రాచీన కాలం నుంచే తెలుగు వారు మల్ల యుద్ధం, ముష్టి యుద్ధం వంటి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులు. విజయనగర సామ్రాజ్య కాలంలో తెలుగు నేలలో కొన్ని వేల మంది మల్లయోధులు పోటీల్లో పాల్గొనేవారు. భారత రాబిన్‌హుడ్‌గా పేరొందిన సర్వా పాపడు కూడా తెలుగు యుద్ధ విద్యలను ఉపయోగించే మొఘలులకు చుక్కలు చూపించాడు. ఆంధ్రులకే చెందిన ప్రత్యేక మార్షల్ ఆర్ట్స్ వేల ఏళ్ల నాటి నుంచి ఉన్నాయి. చేడి తాలింఖానా లేదా యుద్ధ కౌశల్య చే తాలిమ్‌గా పిలిచే ఈ యుద్ధ విద్యను తాలింఖానా లేదా తాలిం అని కూడా సంబోధిస్తారు. బాకు సాము, కర్ర సాము, కత్తి సాములు ప్రధానంగా సాధన చేస్తారు. గద, పట వంటి ఆయుధాలను ఉపయోగిస్తారు. ఇప్పటికీ అమలాపురంలో దీని మనుగడ కనిపిస్తుంది. దసరా ఉత్సవాల్లో ఈ యుద్ధ కళను ప్రదర్శిస్తారు. అబ్బిరెడ్డి రాందాస్ 1856లో స్వాతంత్ర్య ఉద్యమ వ్యాప్తికి ఈ కళనే స్ఫూర్తిగా కోనసీమలో ఉపయోగించారు. కోనసీమ పూర్వ వీరులకు రాయల సామ్రాజ్యం నుంచి అందిన జ్ఞాపికను అబ్బిరెడ్డి సేకరించారు. శ్రీకృష్ణదేవరాయలు ఇచ్చిన ఆ జ్ఞాపిక ఆయన వంశస్తుల వద్ద ఉంది.

మల్లయుద్ధం

మర్మ కళ

క్రీ.శ. నాలుగో శతాబ్దికి చెందిన శుశ్రూత సంహిత మానవ శరీరంలో 107 కీలక మర్మ కేంద్రాలుంటాయని వర్ణించింది. ఆ తర్వాత వీటిని 108గా లెక్కించారు. వీటిలో 64 కేంద్రాల్లో పిడిగుద్దుతో గానీ, కర్రతో గానీ సరిగ్గా కొట్టగలిగితే ప్రాణాలు పోగలవని చెబుతూ మర్మ కళకు బీజాలు వేసింది. మర్మ కళపై అనేక వాదోపవాదాలున్నాయి. ఇప్పటికీ కేరళలోని కొన్ని వర్గాలు అతి రహస్యంగా ఈ విద్యను కొనసాగిస్తున్నాయని అంటారు.

పిలవబడే ఈ కళ ప్రస్తుతం మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు.

శిలంబం

ఆయుధ ప్రధానంగా ఉండే ఈ యుద్ధ కళ తమిళనాట నుంచి వచ్చింది. ప్రస్తుతం మలేషియా, శ్రీలంకలో బాగా ప్రాచుర్యంలో ఉంది. కలరిపాయట్టు, శ్రీలంకలోని అంగమ్‌పోరకు ఇది దగ్గరగా ఉంటుంది. కేరళలోని కురింజి కొండల్లో దొరికే ప్రత్యేకమైన వెదురుతో చేసిన కర్రను ఉపయోగిస్తారు. శిలంబంలోను ప్రధానంగా 18 శైలులున్నాయి. నిల్లైకలాక్కి పాఠశాల శైలి ఎక్కువగా మలేషియాలో కనిపిస్తుంది. 1400 సంవత్సరం నాటికే అక్కడ ఇది వ్యాపించింది. వెదురు కర్రతో పాటు మారు, అరువాల్, పాంతుకోల్, వాల్, కుట్టు కటాయ్, కత్తి, కటారి, సురుల్ పట్టాయై, ముచాన్ వంటి అనేక రకాల ఆయుధాలను ఉపయోగిస్తారు. ఆయుధం లేకుండా కూడా శిలంబంను సాధన చేస్తారు.

మర్దానీ ఖేల్

మహారాష్ట్రకు చెందిన ఆయుధ ప్రధానమైన ఈ యుద్ధ కళ గెరిల్లా పోరాటాలకు నాంది పలికింది. కొల్హాపూర్‌లో ఎప్పటి నుంచో ఉన్న మర్దానీ ఖేల్‌ను 1600లలో మరాఠా గెరిల్లా దళాలను నడిపిన షాహాజీ అభివృద్ధి చేశాడు. ఒక్కో దళ సభ్యుడు ఒక్కో ఆయుధంలో నైపుణ్యాన్ని సాధించే ఈ విద్యలో షాహాజీ కుమారుడు ఛత్రపతి శివాజీ 4 అడుగుల భవానీ అనే ఖడ్గ విద్యలో ఆరితేరాడు. అప్పటి నుంచి మరాఠా సైన్యంలో భాగమైన ఈ విద్య ఇప్పటికీ భారత సైనిక రెజిమెంట్‌లోని మరాఠా సైనికులు నేర్చుకుంటారు. కుర్హాడ్, దండ, ఖుకురీ, ధనుష్య, కట్యారా, బిచువా, బాగ్‌నాక్, పట, తల్వార్, భల, బార్చా, విట, బోతటి, లాఠీ, దళ, మధు వంటి అనేక రకాల కత్తులు, దండాలు, గొడ్డళ్ల తదితర ఆయుధ శ్రేణి ఉంటుంది.


గట్కా

హుయెన్ లాంగ్లాన్

మణిపూర్‌కు చెందిన ఈ మార్షల్ ఆర్ట్‌లో రెండు పద్ధతులుంటాయి. అవి ఆయుధాలను ఉపయోగించే తాంగ్టా, నిరాయుధంగా పోరాడే సారిత్ సరక్. ఖడ్గం, బల్లెం ప్రధాన ఆయుధాలు. బర్మాకు చెందిన బందో, బంషాయ్‌లు దీనిని పోలి ఉంటాయి. మణిపూర్ ఉత్సవాలపుడు ఈ కళను ప్రదర్శిస్తారు. థెంగౌ నృత్యంలో దీన్ని విశేషంగా ఉపయోగిస్తారు. మోయ్‌రాంగ్, లువాంగ్, మ్యాంగాంగ్, ఖుమాన్, అంగోమ్, ఖాబా–న్గాంబా, సారంగ్ లీషాంగ్థెమ్ అనే ఈ ఏడు వర్గాల గిరిజన తెగలు ఒకే మైత్రీ సమాజంగా ఏర్పడేందుకు హుయెన్ లాంగ్లాన్ పోటీనే ఆశ్రయించారు. అప్పట్లో గెలిచినవారి తలలను నరికి ట్రోఫీలుగా తీసుకెళ్లేవారు. ఆ తర్వాత దీన్ని నిషేధించారు. ప్రస్తుతం స్త్రీ, పురుషులిద్దరికీ శిక్షణనిస్తూ అభివృద్ధి చేస్తున్నారు. ఈ మార్షల్ ఆర్ట్ మనుగడకు తీవ్రంగా కృషి చేసిన గురుమాయిుం గౌరకిషోర్ శర్మను 2009లో కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

కర్రసాము

స్కే

కాశ్మీరీల ప్రాచీన యుద్ధ కళ స్కే. ఇది కూడా ఇండో–ఆర్యన్ వలసలకు పూర్వమే ఆ ప్రాంతంలో విలసిల్లింది. నాగా జాతి ప్రజలు దీన్ని సృష్టించినట్టు చెబుతారు. కాశ్మీరీ రాజులు ఈ యుద్ధ కళ అభివృద్ధికి విశేష కృషిచేశారు. ఆలోచనకు కూడా అందనంత వేగంగా ఉండే ఖ్వాంకాయ్ అనే కదలికలు ఈ మార్షల్ ఆర్ట్‌లో ఉంటాయి. ప్రస్తుతం 20 రాష్ట్రాల్లో శిక్షణ అందుబాటులోకి వచ్చింది. అంతర్జాతీయ స్కే సమాఖ్య నెలకొల్పి పోటీలను నిర్వహిస్తున్నారు.

గట్కా

ఉత్తర భారత దేశపు ప్రాచీన యుద్ధ కళ ఇది. పంజాబీయులు ఈ కళను ఎక్కువగా సాధన చేస్తారు. వందల ఏళ్లుగా ఉన్న ఈ కళ శస్త్ర విద్యగా ప్రాచీన భారత్‌లో వెలుగొందింది. ఇప్పుడు ముఖ్యంగా సిక్కు సమాజానికి ప్రధానమైంది. దీన్ని ఒక క్రీడగాను, సంప్రదాయంగాను వినియోగిస్తున్నారు. హోలా మొహల్లా అనే మార్షల్ ఆర్ట్ ఉత్సవంలో ఇదే ప్రధాన యుద్ధ కళ. భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా పంజాబ్‌లో ఈ విద్యను ప్రదర్శిస్తారు.

అకీ కిటి

అకీ కిటి అనే కిక్ ఫైటింగ్ నాగాల్యాండ్‌కు చెందింది. డావో అనే వెడల్పాటి ఖడ్గాలతో చేసే యుద్ధ కళలోను ఆరితేరిన నాగాలాండ్ ప్రజల ద్వారా ఈ యుద్ధ కళ బర్మాకు విస్తరించింది. తెగల మధ్య తగాదాలు వచ్చినప్పుడు అకీ కిటి పోటీల ద్వారానే పరిష్కరించుకుంటారు. కేవలం పాదంతోనే ప్రత్యర్థిపై దాడి చేస్తూ, కాళ్లతోనే దాడిని ఎదుర్కునే ప్రత్యేకమైన యుద్ధ కళ ఇది. బినోత్ అనే మధ్య భారతానికి చెందిన ప్రాచీన కళలో సాయుధులను సైతం వట్టి చేతులతోనే మట్టి కరిపించేవారు.

దక్షిణాది యుద్ధ కళలు కేవలం శారీరక దారుఢ్యం, యుద్ధ పోరాటానికే పరిమితం కాకుండా మానసిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఉన్నతి, అంతఃశక్తి ఉద్దీపనకు అత్యంత ప్రాధాన్యతనిస్తాయి. సినిమాల ప్రభావం వల్ల కుంగ్‌ఫూ, కరాటేలకు విపరీతమైన ప్రచారం లభించినా విదేశీ ప్రొఫెషనల్ యుద్ధ కళావీరులు సైతం భారత మార్షల్ ఆర్ట్స్ పట్ల ప్రత్యేక గౌరవం చాటుతారు. ఇంతటి విశిష్టమైన కళలు నిరాదరణ అనే మరో పెను దెబ్బకు గతంలో కంటే తీవ్రంగా దెబ్బతింటున్నాయి. హాలీవుడ్ మైండ్‌సెట్‌కు అలవాటు పడిన దేశీ యువతకు స్థానిక యుద్ధ కళల పేర్లు కూడా తెలియని పరిస్థితి. కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్ మేనియాల్లోనే కొట్టుకుపోతున్నారు. ఈ పరిస్థితికి ఓ రకంగా ప్రభుత్వాలూ కూడా కారణం. వీటి పరిరక్షణకు బలీయమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడవు. మీడియాలోను అంత ప్రాధాన్యం లభించడంలేదు. కొన్ని కుటుంబాలు, కొన్ని పాఠశాలలు, కొన్ని గ్రామాలు వీటి మనుగడ బాధ్యతల్ని భుజానికెత్తుకుని నడిపిస్తున్నాయి. కానీ, అదీ ఎంతో కాలం సాగదు. వీటి వ్యాప్తి, అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే కేవలం కాగితాల్లోనే వాటి విన్యాసాల్ని చూడాల్సి వస్తుంది. ఈ విద్యలను పాఠశాల విద్యలో భాగం చేస్తే విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయి. క్రమశిక్షణ, మనో నిగ్రహం, ఆత్మ విశ్వాసం, సామాజిక చైతన్యం వంటి ఉదాత్త భావాలు మొగ్గ దశలోనే అబ్బుతాయి. ఓ పరిపుష్టమైన జాతిగా మారుతుంది. చైనా, కొరియా, జపాన్ లాంటి దేశాలు ఈ విషయంలో చాలా ముందంజలో ఉన్నాయి. వారి దైనందిన వ్యాయామాలుగాను యుద్ధ కళల్ని మార్చుకుని బలమైన తరాలను తయారుచేసుకుంటున్నాయి. దక్షిణాసియా యుద్ధకళలకు మూలమైన మనం మాత్రం చాలా వెనకబడిపోయాం. ✦


స్కే

గిజిగాడి గూడు

ఆవుల వెంకట రమణ
9494088110



ఉన్నట్టుండి విసురుగా వీచిన గాలికి గిజిగాడు పట్టు తప్పి కింద పడబోయి నిలదొక్కుకుని పక్కనున్న కొమ్మను పట్టుకుని 'పాడు గాలి నాశనమైపోను' అనుకున్నాడు చిరాకుగా. వారం రోజుల నుంచి కొత్త గూడు కట్టుకోవడానికి ఈనెల్ని పోగు చేస్తున్న గిజిగాడికి హఠాత్తుగా వీచిన గాలి మీద పట్టరానంత కోపం వచ్చింది. తను కట్టుకునే గూడు మిగతా పక్షుల లాంటిది కాదు. పక్షి గూళ్ళన్నిటిలో తమ గూటికో ప్రత్యేకత ఉంది. సాధారణంగా అన్ని పక్షులూ పుల్లా, పుటకా ఏరి చెట్టు మీద గూళ్ళు కట్టుకుంటాయి. అవి ఓ మోస్తరు గాలి వీచినా పడిపోతాయి. పక్షులు పొదిగిన పిల్లలు రెక్కలొచ్చిన తరువాత గూటినొదిలి ఎగిరిపోతాయి. కానీ తమ జాతి పక్షులు ఒకసారి కట్టుకున్న గూడు పాతబడి చిల్లులు పడేదాక ఆ గూటిలోనే సంసారం చేస్తాయి. పిల్లలు కూడా ఆ గూటిలోనే ఉంటాయి. అందుకోసం తమ జాతి పక్షులు గూడుకట్టుకొనేటప్పుడు పిల్లల కోసం ఒక గదిని నిర్మించుకుంటాయి. ఈతాకుల చివర గాలికూగుతూ వినోదాన్ని ఆనందాన్ని పంచే తన గూటిని చూసి మనుషులందరూ అసూయపడుతున్నట్టు తెలిసింది. ఆ మధ్య గుర్రం జాషువా అనే కవి తమ జాతి పక్షుల గూళ్ళను గురించి అద్భుతంగా వర్ణించాడని తెలిసి తమజాతి పక్షులన్నీ సమావేశమై చాలా ఆనందించాయి. 'అవునూ.... తనకు మరో ఇల్లు కట్టుకోవాల్సిన అవసరమేమొచ్చింది...? గిజిగాడి బుల్లి మెదడులో కల్లోలిత తుఫాను. వెన్నులో సన్నని వణుకు ప్రారంభమయి, కళ్ళు బైర్లు కమ్మాయి. ఎంత మరిచిపోదామనుకున్నా ఆ సంఘటన వరదలా ఉరకలెత్తుతూ వస్తుంది.

ఆరోజు "ఏమయ్యో! నిన్నే! నిద్రలే! ఒకసారి బయటి కొచ్చిచూడు" అంటూ గిజిగాడి భార్య ముక్కుతో కదిపే సరికి ఈలోకంలో కొచ్చాడు గిజిగాడు.అదిరే గుండెల్ని ముక్కుతో అదుముకుంటున్న గిజిగాడికి తన గూడు సహజంగా గాలికూగడం కంటే విపరీతమైన వేగంతో ఊగుతున్నట్లు అనిపించి కళ్ళు తెరిచి చూసాడు. సందేహం లేదు ఏదో ప్రళయానికి సూచనగా కర్ణభేరి పగిలేంత శబ్దం చెవుల్లో హోరెత్తిపోతుంది. వణుకుతున్న శరీరంతో ఏం జరుగుతుందోనని కలవరపడుతూ గూట్లోంచి ఎగిరి ఈత చెట్టు మీద కూర్చొని కింద జరుగుతున్న తతంగాన్ని చూసే సరికి గుండాగినట్లయ్యింది.

ఎప్పుడు చేరుకున్నాయో రెండు మూడు ప్రొక్లైనర్లు చేల గట్టు మీద గల తాటి,ఈత, వేప, నల్ల తుమ్మ చెట్లన్నింటిని కూకటి వేళ్ళతో సహా పెకలించివేస్తున్నాయి. తనుండే చెట్టు గట్టు ఇవతలి కొన మీద ఉంది. ఈ గట్టు మీదే తాటి చెట్లే ఎక్కువగా ఉంటాయి. అవి మహావీరుల్లా ఉన్నంత ఠీవిగా ఉంటాయి. వాటి మధ్యలో ఈత చెట్టు కూడా వాటికి ఇంచుమించు సమానంగా ఉండేవి. తాటి,ఈత చెట్లను దూరం నుంచి చూస్తే అన్యోన్యమైన ఆలుమగల వలె అనిపించేవి. తాటి చెట్లు చిన్న చిన్న మట్టలతో అచ్చు మగాడి తలను పోలి ఉండేవి. ఈత చెట్లు ఎత్తులో తక్కువైనా విరబోసుకున్న ఆడదాని తలలా ఉండేవి. ఆ గట్టు మీద అక్కడక్కడా ఇరుగు పొరుగుల్లో వేప, నల్ల, తుమ్మ చెట్లు కూడా ఉండేవి. ఆ గట్టు ఈనాటిది కాదు. దాదాపు యాభై ఏళ్ళ క్రితం పోరంబోకు భూమిని అందరూ ఆక్రమించుకుంటుంటే తనూ కొంత ఆక్రమించుకున్నాడు బక్కిరెడ్డి.భూమి చుట్టూ మొలలోతుగా గాడి తవ్వి మట్టితీసి గట్టేసి ఆ గట్టు మీద అక్కడక్కడా ఏరుకొచ్చిన తాటి విత్తనాల్ని నాటాడు. కళకళలాడుతూ పెరుగుతున్న తాటి మొక్కల్ని చూస్తూంటే బక్కిరెడ్డికి మరో ఆలోచన తట్టింది. తాటి చెట్లు పెరిగి పెద్దవై పైకిపోతే కర్ర ఖాళీ అయిపోయి పశువులు దూరే అవకాశం వుంది గదా! అందుకని

ఈసారి బాగా ముసురు పట్టినప్పుడు ఈత విత్తుల్ని తాటి మొక్కల మధ్య ఖాళీల్లో నాటాడు బక్కిరెడ్డి. బక్కిరెడ్డి అసలు పేరు నారపరెడ్డి. సన్నగా పొడుగ్గా బక్కగా వున్నందు వల్ల అందరూ బక్కిరెడ్డి అని పిలిచేవారు. కొన్నాళ్ళకు నారపరెడ్డి అన్న అసలు పేరు మరుగునపడిపోయి బక్కిరెడ్డి అన్న పేరు సార్థకమైపోయింది.

బక్కిరెడ్డి ఆరుగాలం కష్టించి పోరంబోకును సాగులోకి తెచ్చాడు. అతని స్వేదం తాగిన భూమాత కరుణించింది. ముళ్ళు తుప్పలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన భూమి నాలుగైదేళ్ళలో మంచి ఫలసాయమందించే కామధేనువయ్యింది. ఒకటి రెండేళ్ళ పంట చేతికి రాకున్నా ఓపిక చేసుకొని భూమిని సాగులోకి తెచ్చాడు. బక్కిరెడ్డికి వ్యవసాయం మీద గల మమకారానికి ఊర్లోని వారంతా చాలా ఆశ్చర్యపోయేవారు. ఎండలోనూ, వానలోనూ ఎండిపోయిన తాటాకు తలమీద పెట్టుకుని ఇంటికీ పొలానికీ తిరిగేవాడు. శ్రమించి భూమిని సాగుచేయడంతో ఆగలేదు. బక్కిరెడ్డి ఊర్లోని మిగతా రైతులతో కలిసి అర్జీలు పట్టుకొని తహశీల్దారు కార్యాలయాల చుట్టూ తిరిగేవాడు. ఎన్ని ఆఫీసుల చుట్టు తిరిగినా ఎందరు అధికార్లకు మొక్కినా పనయ్యేదికాదు. అవి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పార్లమెంటుకి రెండోసారి ఎన్నికలు జరుగుతున్న రోజులు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఏ అభ్యర్థి ఊర్లోకొచ్చినా 'ఎవరైతే భూములకు పట్టాలిప్పిస్తారో వారికే ఓట్లేస్తామని' రైతులంతా ఒకేమాట చెప్పేవారు.. ఆనాటి నాయకులకు చిత్తశుద్ధి ఎక్కువ. ఆచరణ సాధ్యం కాని హామీలివ్వడానికి వెనుకాడి వెళ్ళిపోయేవారు. చివరికి అప్పటికే ఒకసారి గెలిచి ఈసారి కూడా పోటీ చేస్తున్న అంకినీడు ముందుకొచ్చాడు. అంకినీడుకి కేంద్రంలో అంతో ఇంతో పలుకుబడి, రాష్ట్ర నాయకులతో పరిచయాలున్నాయి. ఎన్నికలైన మూడు నెలల్లోగా పట్టాలిప్పిస్తానని గ్రామస్థులకు హామీ ఇస్తే ఎన్నికల్లో అందరూ అతనికే ఓట్లు వేశారు. అంకినీడు అఖండ మెజారిటీతో గెలిచి రెండోసారి పార్లమెంటులో అడుగుపెట్టాడు. ఎన్నికల కోలాహలం సద్దుమణిగాక. అందరూ పట్టాల విషయం దాదాపు మర్చిపోయారు. ఒకరోజు గ్రామపెద్ద పేరున పోస్టులో ఓ కవరు వచ్చింది. వచ్చే నెలలో ఎం.పి. గారి సమక్షంలో గ్రామస్థులందరికీ భూమి పట్టాలిస్తున్నట్లు తాలుకా కార్యాలయం నుండి వచ్చిన సమాచారమది. విషయం తెలుసుకున్న రైతుల ఆనందానికి అవధుల్లేవు. ప్రభుత్వం నుంచి పట్టాలు పుచ్చుకున్న రైతులు వర్షాధారంగా రాగులు, కొర్రలు, ఆ తరువాత వరుసగా వరి పండిస్తూ వచ్చారు. బక్కిరెడ్డి హయామంతా వర్షాధార సేద్యంతోనే గడిచిపోయింది. కాలంతో పాటే తాటి చెట్టు చేతికందనంత ఎత్తుకెదిగింది. ఈత చెట్లు కూడా మనిషంత ఎత్తుకెదిగాయి. ఒంట్లో నడువగలిగిన ఓపిక వున్నంత కాలం చేలోకెళ్ళి తాటి చెట్ల వరసని ఆప్యాయంగా తాకి చూసుకునేవాడు. అలా చూసుకున్నప్పుడు అతనికి తన కొడుకు పెళ్ళీడుకెదిగినంత ఆనందం కలిగేది. ఒక అనిర్వచనీయమైన అనుభూతితో హృదయం పొంగేది. తను చనిపోయిన తరువాత ఆ తాటి చెట్ల మధ్యనే సమాధి చేయమని అప్పుడప్పుడూ తన కొడుక్కి చెపుతుండేవాడు బక్కిరెడ్డి.తండ్రిమీద గౌరవంతో తండ్రి శవాన్ని తాటి చెట్ల మధ్యనే పూడ్చి పెట్టి సమాధి కట్టాడు సుబ్బారెడ్డి. సుబ్బారెడ్డి కూడా కొంత కాలం వర్షాధార సేద్యం చేశాడు. సోమశిల ప్రాజెక్టు ప్రారంభమైన తరువాత నీటి పారుదల మీద కొన్నేళ్ళు పండించాడు. పారుదల సేద్యం ఏడాదికోమారే అని భూగర్భజలాల కోసం బోర్లు వేయసాగారు రైతులంతా. సుబ్బా రెడ్డి కూడా తన పొలంలో బోరు వేశాడు. మంచి నీళ్ళే పడ్డాయి. ఇక సుబ్బారెడ్డి దశ తిరిగిపోయింది. ఏటా మూడు కార్లు పండసాగాయి. నీటికి దిగుల్లేదు. పంట మీదున్నప్పుడు చూడాలి సుబ్బారెడ్డి చేను పసుపు పచ్చగా బంగారం పండినట్లుండేది. ఒక కారు ఏడాది మొత్తం పెట్టుబడికి పోయినా రెండు కార్లు చేతికొచ్చేవి. ఆ వెసులుబాటుతోనే ఆడ పిల్లల పెళ్ళిళ్ళు చేసి ఉన్నంతలో ఘనంగా కట్న కానుకలు ఇచ్చి సాగనంపాడు. ఇక మిగిలింది కొడుకు విజయ రాఘవరెడ్డి ఒక్కడే . సుబ్బారెడ్డి కొడుకును చిన్నప్పట్నుంచి వ్యవసాయానికి దూరంగా పట్నంలో చదివించాడు. సెలవుల్లో ఇంటికొచ్చినా చేల వైపు రానిచ్చేవాడు కాదు.పల్లె జీవితానికి దూరంగా పట్నంలో పెరిగినందుకేమో విజయరాఘవ రెడ్డికి వ్యవసాయమంటే సదభిప్రాయంలేదు. అందుకే అప్పుడప్పుడు తండ్రితో "నాన్నా! ఇప్పుడు కూడా ఇలా బురద పట్టుకొని బతకడమెందుకు? మనలాంటి రైతు కుటుంబాల్ని చూడు ఇల్లూ పొలాలు అమ్ముకుని పట్నంలో ప్లాట్లూ, బిల్డింగులు కట్టుకుని మిగిలిన వాటితో ఏదో ఒక వ్యాపారం చేసుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేసుకుంటున్నారు' అంటుండేవాడు. కొడుకు అలా అన్న ప్రతిసారీ సుబ్బారెడ్డికి ఎక్కడో కలుక్కుమనేది. ఆధునికత పేరుతో, నాగరికత పేరుతో ఈనాటి యువతరం తెలియని దారుల్లో కొట్టుకుపోతూ ఉంది. దేశానికి తిండిపెట్టే వ్యవసాయం వదిలి రమ్మంటాడేమిటి? తన కొడుక్కి చేనుగట్టు చూపించకుండా పెంచి తనేమైనా పొరబాటు చేశానా? అని మదన పడేవాడు. సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు ఒకటి రెండు సార్లు తండ్రికి మధ్యాహ్నం తిండి తీసుకొచ్చినప్పుడు పొలం గట్టుమీద వరుసగా వున్న తాటి చెట్లను చూసి తండ్రినడిగాడు "ఏంటినాన్న మనపొలంలో ఇన్ని తాటి చెట్లుంటే ఇంటి వాసాలకి పట్నంలోని అడితి నుంచి తెప్పించావు".

"చూడబ్బయ్యా ఇవి మా నాయనేసిన తాటి చెట్లు. ఆయన దీన్ని ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకున్నాడు. ఆయన చావబోతూ కూడా ఈ చెట్ల నుంచి వచ్చేవి తప్ప ఆ చెట్ల నుంచి ఏదీ ఆశించవద్దనీ వాటిని నరకవద్దనీ నా చేత ఒట్టేయించుకున్నాడు. అంచేత దాన్ని మనమెప్పుడూ నరక్కూడదు. నరికితే తాత ఆత్మ ఘోషిస్తుంది" అన్నాడు సుబ్బారెడ్డి.

తండ్రి మాటలు కొడుక్కి రుచించలేదు. అతని దృష్టిలో 'ఆత్మఘోష' లాంటి మాటలు ట్రాష్ అనిపించాయి. "ఏంటి నాన్నా నీ చాదస్తం.. చనిపోయిన తరువాత ఇంక ఆత్మ అంటూ ఒకటుంటుందా. గుండె పనిచేయడం ఆగిపోయిన వెంటనే రక్త ప్రసరణ ఆగిపోయి మాంసమంతా తినిపోతే... మట్టిలో చీకిపోని కర్బనకాల్షియం గుణాలున్న వెంట్రుకలూ, ఎముకలూ అలాగే ఉంటాయి. ఇంక ఆత్మ ఎక్కడుంది? ఒక వేళ ఉన్నా అదేం చేస్తుంది? మనిషి మట్టిలో కలిసిపోయాక దాని అడ్రసెక్కడుంది? అయినా భూమ్మీద లేనివారి కోసం అర్థం లేని సెంటిమెంట్లను నమ్మి మన జీవితాల్ని ఎంజాయ్ చేసుకోకుండా వుండాల్నా"? అన్నాడు. సుబ్బారెడ్డికి మనసు కలుక్కుమని తల గిర్రున తిరిగినట్లయ్యింది. "ఏంటబ్బయ్యా! నాలుగక్షరాలు చదివి తెలివిగా బతుకుతావనుకుంటే తలా తోకా లేకుండా మాట్లాడుతుండావు. ఈ ప్రపంచం అనాది నుంచీ ఎట్టాస్తుందో అట్నే మనమూ నడవాలి. ఏటికెదురు నడవరాదు. పెద్దల్ని లెక్క చేయకుండా మాట్లాడొద్దు, తండ్రి మాటలు విజయరాఘవ రెడ్డికి బలంగా తగిలాయి. తండ్రికెదురు చెప్పే ధైర్యం చాల్లేదు.లేచి ఆ తాటి చెట్ల వరుసనో సారి చూసి చకచకా వెళ్ళిపోయాడు. ఆ చూపులో ఆఫ్ట్రాల్ చెట్టును కూడా మనిషిలా చూడాలా అన్న చులకన భావన కొట్టొచ్చినట్టు కనబడింది.

కాల పవనాలు కొన్ని సంవత్సరాల్ని మోసుకొచ్చాయి. ఇప్పుడు సుబ్బారెడ్డి వయసుడిగి నడుం వంగిపోయి వ్యవసాయం చేసే ఓపిక లేక ఇంటిదగ్గరే వుంటున్నాడు. అప్పుడప్పుడూ ఓపిక తెచ్చుకుని చేలోకి పోయి చెట్లను చూసి వస్తున్నాడు. విజయరాఘవరెడ్డి చదువు చాలించి పెళ్ళి చేసుకొని పట్నంలో వ్యాపారం చేస్తున్నాడు.భూమిని నాలుగైదేళ్ళ క్రితమే కౌలుకిచ్చాడు. కౌలు ద్వారా వచ్చే గింజలతో రెండు కుటుంబాలకు ఏడాది పాటు తిండికి లోటు లేకుండా ఉంది. కాలం రకరకాల మార్పులకు దోహదం చేస్తుంది. అదిప్పుడు ఊళ్ళోకి రొయ్యల చెరువుల్ని తెచ్చిపెట్టింది. బంగారం పండే మాగాణి భూములన్నీ ప్రొక్లైనర్ల మోతతో హోరెత్తిపోయాయి.. చెరువు కట్టలు వేయడానికి రైతులంతా ముందుగానే ట్రాక్టర్లనూ, జె.సి.బి లనూ ప్రొక్లైర్లను మాట్లాడి మాగాణుల్ని చెడగొట్టి కట్టలు వేయించి నీళ్ళ కోసం మోటార్లు కొనే ప్రయత్నంలో వున్నారు. మార్పుని తొందరగా అంగీకరించలేని

కొందరు రైతులు ఈ పరిణామాల్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. 'వీరికేం పోయేకాలమొచ్చిందిరా దేవుడా! కడుపులో చల్ల కదలకుండా ఏడాదంతా కడుపు నింపుతున్న మాగాణుల్ని నాశనం చేసి ఆ ఉప్పు చెరువులు చేసేస్తే రేపు తిండి గింజలెక్కడ్నుంచి తెచ్చుకుంటారు?' అని ముక్కు మీద వేలుసుకుని చూడడమే వారి వంతయ్యింది. అసలే వ్యవసాయం గిట్టని విజయరాఘవరెడ్డికి ఈ అవకాశం అందివచ్చినట్టయ్యింది. ఏడాదిపొడవునా తిండి గింజలు కొనకుండా ఆదుకుంటున్న భూమి మనిషి అత్యాస ముందు ఎందుకు కొరగాకుండా పోయింది.. ఓ రోజు మధ్యాహ్నపు వేళ ఎర్రటి ఎండలో విజయ రాఘవరెడ్డి తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఆ మాటా ఈ మాటా అయిన తరువాత మధ్యాహ్న భోజనాల తరువాత మనసులోని మాటను మెల్లగా కక్కాడు విజయ రాఘవ రెడ్డి.

" ఆ కౌలు గింజలతో ఏమొస్తాయి నాన్నా. సంవత్సరం మొత్తం మీద అయిదువేలు కూడా రావు." హఠాత్తుగా అక్కడి వాతావరణం గంభీరంగా మారిపోయింది. కొడుకిలా అంటాడని కలలో కూడా ఊహించలేదు. 'ఈ సారి కూడా వీడేదో పథకంతో వచ్చినట్టున్నాడు. ఏమిటి వీడి బాధ..? వ్యవసాయం ఇష్టం లేకున్నా చేయకుండా నీడన కూర్చున్నా సంవత్సరమంతా కడుపు నింపుతున్న మాగాణి భూములంటే వీడికెందుకింత చిన్నచూపు'. అయితే ఇప్పుడేమంటావురా"? సుబ్బారెడ్డి సూటిగానే అడిగాడు. "ఏం లేదు మన పొలాన్ని రొయ్యల చెరువు చేస్తే నాలుగు నెలల్లోనే లక్షల్లో లాభాలొస్తాయి" అన్నాడు విజయరాఘవరెడ్డి.

"ఇప్పుడేం లోటయ్యిందిరా నీకు? సొంత చేనులో పండిన సారమైన గింజలు తిని వయసుడిగినా కాలూ నొప్పు ల్లేక సుఖంగా వున్నాం. ఆ చారెడు పొలాన్ని కూడా అమ్ముకొని రేషను బియ్యం మా మొఖాన పడేయడానికా... ఒరే బాబూ వ్యవసాయం అంటే నీకెందుకురా అలుసు. నువ్వంటే చేను గట్టెక్కకుండా పెరిగావు. పల్లెటూర్లో పుట్టి నోళ్ళందరూ బురద పిసక్కుండా , కొండ్రలెయ్యకుండా ఎలా బతకగలరు.వ్యవసాయం చేయకుంటే దేశానికి తిండెలా దొరుకుతుంది. నీకు ఒక్క సంవత్సరానికే పాతికవేలు కట్టి ఇన్ని సంవత్సరాలు చదివించామే ఆ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చిందనుకున్నావ్.? ముగ్గురక్కల పెళ్ళిళ్ళూ,కట్నా కానుకలూ పైసా అప్పులేకుండా చేశామే అదంతా ఎక్కడ్నుంచి వచ్చిందనుకుంటున్నావ్? అంతా 'ఆ పొలంలో పండిన బంగారం అమ్మగా వచ్చిందేరా! రాత్రి పగలూ రెక్కలు చేసుకొని నారు నాటిన కాడనుంచి గింజలు ఇంటికొచ్చేదాకా కళ్ళల్లో ఒత్తులేసుకొని కాపలా కాచి పంట చేతికందుకునేవాళ్ళం. నేను మీ నాన్నా. అయినా మనకేం లోటురా? ఉన్నవి చాలవా? రొయ్యల చెరువులు చేసి గంగిగోవులాంటి పొలాన్ని నాశనం చేసి ఉన్న డబ్బంతా ఉప్పునోట్లో పోస్తే జన్మలో కోలుకుంటామా. అలా ఎన్నిళ్ళు యోధిన పడ్డలేదు'. తల్లి లక్ష్మమ్మ సుదీర్ఘ ఉపన్యాసంలా సాగదీసింది.

"ఒరే అమ్మ చెప్పిందిన్నావుగా ! మొండిగా చెరువులే చేయదల్చుకుంటే ముందు నా పీక కోసి ఆ తర్వాత నీయిష్టమైనన్ని చెరువులు చేసుకో" అన్న తండ్రి మాటలతో ఖంగుతున్న విజయరాఘవరెడ్డి ఇంకేమీ మాట్లాడకుండా ఒక్క ఉదుటున లేచి వెళ్ళిపోయాడు.

పక్కా వ్యాపారవేత్తయిన విజయ రాఘవ రెడ్డికి రొయ్యల చెరువులు చేయాలన్న కోరిక మాత్రం చావలేదు. ఈ సారి తండ్రికి చెప్పకుండానే చేసెయ్యాలనుకున్నాడు. ఓ రోజు పట్నం నుంచి వస్తూ ప్రొక్లైన్లను తీసుకొచ్చాడు. వచ్చిన యంత్రాలు పని ప్రారంభించాయి. తరతరాలుగా ఆ చెట్ల కొమ్మల మీద స్థిరనివాస మేర్పరుచుకున్న పక్షులు, ఉడతలు హాహాకారాలు చేస్తూ చెల్లాచెదురవుతున్నాయి. హృదయంలేని యంత్రాలకు దయాదాక్షిణ్యాలెలావుంటాయి? ఎంత పెద్ద చెట్టునైనా కూకటి వేళ్ళతో పెకలించివేస్తాయి. ఆ యంత్రాన్ని నడిపేవాడు మదపుటేనుగును అదుపులో ఉంచే మావటిలా ఉన్నాడు. వాడు ఎటు తిప్పితే అది అటు తిరుగుతూ ఉంది. ఒక చెట్టు పెరిగి పెద్దది కావాలంటే ఎన్నేళ్ళు పడుతుంది? దాని వెనుక ఎంత జాగరూకత! ఎంత యాజమాన్యం? ఎంత శ్రమ ఉంటుంది? ఈ విషయాలు వినాశకారులకు ఏం తెలుస్తుంది. అప్పటిదాకా దాకా నందనవనంలా కనిపించిన చెట్లు ఇప్పుడు తుఫాను తరువాతి బీభత్సకాండలా భారీయంత్రానికి తలలు వంచిన వీరుల్లా వున్నాయి. విజయరాఘవరెడ్డి హుషారుగా అడుగేసుకుంటూ గిజిగాడున్న ఈత చెట్టు దగ్గర కొచ్చాడు. వంద మంది కూలీలకు కూడా కాని పని ఒక యంత్రం గంటలో చేసేసింది. వాడికి తాతల నాటి పొలాన్ని చెడగొడ్తున్నానే అన్న బాధ ఏ కోశానా లేదు. గిజిగాడికి పట్టరానంత కోపం, అసహ్యం కలిగాయి. 'పాపాత్ముడా! ఈ చెట్టును పెంచడానికి నీ తాత ఎంత కష్టపడి వుంటాడో నీకేం తెలుసురా? నీ తాతగారి మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా ఇన్ని జీవమేధాల్ని చేసేవాడివే కావు' అనుకుంది మనసులో. విజయరాఘవరెడ్డి ఈత చెట్టు వైపు వస్తున్న ప్రొక్లైనర్ డ్రైవర్‌కి ఏవో సైగలు చేస్తూ చెప్తున్నాడు. వాడతని సూచనలకు తలూపుతూ భారీ యంత్రాన్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. గిజిగాడికి ఏమీ పాలుపోవడం లేదు.అడకత్తెరలో పోక చెక్కలా ఉంది దాని పరిస్థితి. తక్షణ కర్తవ్యమా లోచించాల్సిన మెదడు పనిచేయనని మొరాయించింది. గుడ్లప్పగించి స్థాణువులా ఉండిపోయింది. కింద మనసులేని మొరటు యంత్రాలు తన పని తాను చేసుకుపో తున్నాయి.అయిదు వేళ్ళలో పెద్ద పెద్ద ఇనుప చువ్వలు కలిగి అరచేయిలా లోతైన ఇనుపతొట్టిని చెట్టుమొదలు కిందికి పోనిచ్చి వేళ్ళ కింద మట్టిని తీసి బయటికి పోస్తోంది. చెట్ల పైన తూనీగలు, చిన్న చిన్న పక్షులు ఆందోళనగా తిరుగుతున్నాయి. చెట్టుమీద గూడు కట్టుకున్న మిగతా గిజిగాళ్ళు కూడా బయటికొచ్చి ప్రాణ భయంతో అరుస్తున్నాయి. డబ్బు సంపాదన కోసం ఒకడు చెట్టును నరికేస్తాడు. ప్రొక్లైనర్ డ్రైవర్లు డబ్బు కోసమే యంత్రాన్ని తిప్పుతారు. జీవితమే వ్యాపారమైన సంధికాలంలో అన్ని విలువలూ నశిస్తాయి. చూస్తుండగానే ఈత చెట్టు వేర్లన్ని తెగిపోయి కూలిపోవడానికి సిద్ధంగా వుంది. పైనున్న గిజిగాడికి పరిస్థితి తుఫానులో చిక్కుకున్న ఓడలాగుంది. ఇంకో అర క్షణంలో చెట్టు కూలుతుందనగా భార్యకు సైగ చేసి ఎగిరిపోయి ప్రాణాలు దక్కించుకుంది.



అదురుతున్న గుండెల్ని మరోసారి ముక్కుతో అదుముకొని స్థిమితపడడానికి ప్రయత్నించింది గిజిగాడు. ఆ పీడకలని ఎంత మర్చిపోదామనుకున్నా మరువలేకపోతుంది. తమ కింత ద్రోహం చేసి, రొయ్యల చెరువులు చేసి వాడెలా లాభాల్ని గడిస్తాడు అన్న ఆలోచనలతో ఊగిపోతూ గూడుకోసం ఆకుల్ని చీల్చి ఈనెల్ని పోగుచేస్తున్నాడు గిజిగాడు. ✦

ఎగ్ చట్నీ

కావాల్సిన పదార్థాలు

కోడిగుడ్లు–డజను, కారం–పావు కేజీ, ఉప్పు–200 గ్రా, పసుపు–రెంచు చెంచాలు, మెంతులు, జీలకర్ర–చెంచా చొప్పున, ఎండు మిర్చి–ఆరేడు, చింతపండు–పావు కేజీ, నూనె–పావు కేజీ, వెల్లుల్లి రెబ్బలు–కొన్ని

తయారీ

మెంతుల్ని వేయించి పొడి చేసుకోవాలి. కోడిగుడ్లను ఉడికించి పొట్టు తీసి నూనెలో వేయించి పెట్టుకోవాలి. ఓ పాత్రలో కారం, పసుపు, ఉప్పు, చింతపండు గుజ్జు, మెంతి పిండి, నూనె తీసుకుని బాగా కలపాలి. ఇప్పుడు వేయించి పెట్టుకున్న కోడిగుడ్లు వేసి మరోసారి కలపాలి. మిగిలిన నూనె వేడిచేసి ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్రతో తాలింపు పెట్టి పచ్చడిపై వేసి బాగా కలపాలి. చివరగా వెల్లుల్లి రెబ్బలు అలంకరిస్తే చాలు.. నిల్వ ఉండే కమ్మని కోడిగుడ్డు పచ్చడి సిద్ధం.

రొయ్యలతో..

కావాల్సిన పదార్థాలు

కోడిగుడ్లు–మూడు, రొయ్యలు–పావు కిలో, ఉల్లిపాయలు, పచ్చి మిర్చి–ఐదు చొప్పున, నూనె–ఇరవై అయిదు గ్రాములు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం–చెంచా చొప్పున, పసుపు–చిటికెడు, ఉప్పు–రుచికి సరిపడా, గరం మసాలా–చెంచా, కొత్తిమీర తురుము–కొద్దిగా

తయారీ

రొయ్యల్ని శుభ్రం చేసి పెట్టుకోవాలి. ఇపుడు కోడిగుడ్లు ఉడికించుకుని. చల్లారాక పెంకు తీసి అక్కడక్కడా గాట్లు పెట్టాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి నూనె వేడిచేసి అందులో పసుపు, గుడ్లు, తగినంత ఉప్పు వేసి వేయించాలి. ఐదు నిమిషాలయ్యాక తరిగిన ఉల్లిపాయ, పచ్చి మిర్చి ముక్కలు వేయించాలి. కాసేపయ్యాక అల్లం వెల్లుల్లి ముద్ద చేర్చాలి. ఇవన్నీ బాగా వేగాక రొయ్యలు ఆ తరువాత కారం వేసి కలిపి కాసిన్ని నీళ్లు చల్లి మూతపెట్టేయాలి. కాసేపటికి కూర తయారవుతుంది. గరం మసాలా చల్లి దింపే ముందు కొత్తిమీర తురుముతో అలంకరిస్తే సరిపోతుంది. నోరూరించే కోడిగుడ్డు రొయ్యల కూర సిద్ధం

కోడిగుడ్డు మసాలా కూర

కావాల్సినవి పదార్థాలు

ఉడికించిన గుడ్లు–4, ఉల్లిపాయలు–2, చింతపండు పులుసు–1/4 కప్పు, జీలకర్ర పొడి–1/2 టీ స్పూను, మెంతి పొడి–1/4 టీ స్పూను, నువ్వుల పొడి–3 టీ స్పూన్లు

తయారీ

ప్యాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి మెత్తబడే వరకు వేయించాలి. ఇందులో పసుపు, కారం పొడి, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిసేపు వేయించాలి. తర్వాత ఉడికించి పొట్టు తీసిన కోడిగుడ్డు వేసి కలపాలి. ఒక గిన్నెలో జీలకర్ర పొడి, మెంతి పొడి, నువ్వుల పొడి, చింతపండు పులుసు, ధనియాల పొడి, అర కప్పు నీళ్ళు పోసి ఉండలు లేకుండా కలిపి ఉల్లిపాయలో వేయాలి. తగినంత ఉప్పు కలిపి మూత పెట్టి ఉడికించాలి. మొత్తం ఉడికిన తర్వాత దింపేయాలి. ఈ కూర పలావ్, బిర్యానీకి బావుంటుంది.

కుర్మా

కావాల్సిన పదార్థాలు

ఉడకబెట్టిన గుడ్లు–3, ఉల్లిపాయ–1, పచ్చి మిరపకాయలు–8, పాలు–ఒక కప్పు, జీలకర్ర–3 టేబుల్ స్పూన్లు, ఆవాలు– ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర పొడి–ఒక టేబుల్ స్పూన్, ధనియాలు–ఒక టేబుల్ స్పూన్, మసాలా పొడి–ఒక టేబుల్ స్పూన్, నూనె–4 టేటుల్ స్పూన్లు, ఉప్పు–తగినంత

తయారీ

ముందుగా పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయలను ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. తరువాత ధనియాలు తీసుకుని తరిగిన పచ్చి మిరపకాయలతో కలిపి కొంచెం నీరు పోసి బాగా గ్రైండ్ చేయాలి. ఆ మిశ్రమాన్ని పక్కన పెట్టి మూకెడ తీసుకుని నూనె వేసి కాగనిచ్చిన తర్వాత ఆవాలు, ధనియాలు వేయించాలి. కొంచెం వేగాక తరిగిన ఉల్లిపాయ ముక్కలను వేసి దొరగా వేయించాలి. తర్వాత గ్రైండ్ చేసిన మిర్చి మిశ్రమాన్ని కూడా దీనిలో కలిపి 5 నిమిషాలు వేయించాలి. తర్వాత పాలు పోసి కలియబెట్టాలి. కొంచెం ఉడికాక ఉడికించిన గుడ్లు వేసి సన్న మంట మీద మగ్గనివ్వాలి. కొంచెం సేపటికి ఉప్పు మసాలా పొడి, కొత్తిమీర పొడి వేసి కలపాలి. బాగా ఉడికిన తర్వాత దించివేయాలి. ఘుమఘుమలాడే ఎగ్ కుర్మా రెడీ.

చుక్కలు కలపండి





అతికించండి

ఓ అల్లరి పిల్లవాడు క్రిస్మస్ తాత బొమ్మను కత్తిరించేశాడు. తిరిగి వాటిని అమర్చడం మరిచిపోయాడు. వాటిని మీరు తిరిగి అతికిస్తారు కదా.



రంగుల జిరాఫీ

పిల్లలూ మీకు ఇష్టమైన రంగులు వేయండి

పదకేళి



అడ్డంగా

2.

4. 

6.

నిలువుగా

1. 

3. 

5.

ఈ కింద ఇచ్చిన బొమ్మల ఆంగ్ల పేర్ల ఆధారంగా పదకేళిని పూరించండి

అమ్మాయి కనిపించిందా?

ఇక్కడో ఏనుగు ఎంచక్కా షికార్లు చేస్తోందికదా. ఆ ఏనుగు మీదే ఓ అమ్మాయి రూపం కూడా వుంది. కనిపించిందా?

జవాబు : ఏనుగు చెవి దగ్గర చూడండి.

పదకేళి జవాబు : 1. vampire,2.bat 3.broom 4.spider 5. moon 6. pumpkin

వేట పగటి పూటే



నేల మీద నివసించే వాటిలో అత్యంత వేగంగా పరుగెత్తే జంతువు చిరుతపులి.

- వేగంగా పరుగు తీయాల్సి వచ్చినప్పుడు చిరుతలు తమ శ్వాస నాళాలను వెడల్పు చేసుకుంటాయి. అలా ఎక్కువ ఆక్సిజన్‌ని పీల్చుకునేందుకు ప్రయత్నిస్తాయి. వేగంగా పరుగెత్తేందుకు ఆ ప్రక్రియ చాలా ఉపయోగపడుతుంది వాటికి.
- వేగంగా పరుగెత్తుతున్నప్పుడు చిరుతలు నిముషానికి 150 సార్లు శ్వాసను తీసుకుంటాయి. మామూలప్పటి కంటే ఇది మూడు రెట్లు ఎక్కువ.
- చిరుతల కళ్ల నుంచి నోటి వరకు ఇరువైపులా నల్లని చారలు వుంటాయి. వీటిని టియర్ లైన్స్ అంటారు. ఇవి అతి వేడిమి నుంచి చిరుతల కళ్లను కాపాడతాయని, ఎక్కువ దూరం వరకూ చూసేందుకు తోడ్పడతాయని పరిశోధనల్లో తేలింది. దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో వున్నవి కూడా వీటికి స్పష్టంగా కనిపిస్తాయి.
- పులులు సింహాల మాదిరిగా ఇవి గాండ్రించలేవు.

వీటికి పెద్దగా దాహం వేయదు. అందుకే రెండు మూడు రోజులకు ఒక్కసారే నీళ్ల తాగుతుంటాయి.

- ఇవి జంతువు కనిపించగానే దానికి వీలైనంత దగ్గరగా వెళ్లి ఒక్కసారిగా లంఘించి మీద పడి, మెడ దగ్గర వుండే ముఖ్యమైన నాళాన్ని తెంపేస్తాయి. ఒకవేళ ఆ జంతువు వీటిని గుర్తించి తప్పించుకుంటే చాలా వేగంగా పరుగెత్తివాటిని వెంటాడి, వేటాడతాయి.

చిరుత పిల్లలు మూడు నాలుగు నెలలు గడిస్తే గానీ మాంసాన్ని తినలేవు. ఈలోపు తల్లిపాలు తాగుతాయి. ఏడాదిన్నర వయసు వచ్చేవరకూ తల్లి వెంటే తిరుగుతాయి. ఈ మధ్యకాలంలో తల్లి వాటికి వేటాడడం, శత్రువులను ఎదుర్కోవడం నేర్పుతుంది. అది కూడా ఎంత తెలివిగానంటే... ఓ జంతువును చంపి తెచ్చి పిల్లల ముందు పడేస్తుంది. ఆ కళేబరాన్ని ఉపయోగించి వేటను నేర్పుతుంది. చిరుతలకు రాత్రిపూట కళ్లు సరిగా కనిపించవు. అందుకే పగటిపూట మాత్రమే వేటకు వెళ్తాయి.

- ఇవి కేవలం మాంసాన్ని మాత్రమే తింటాయి తప్ప ఆ జంతువు చర్మాన్ని కానీ, ఎముకల్ని కానీ తినవు.

'జనరిక్'పై అనుమానాలు పటాపంచలు

వైద్య ఖర్చుల కారణంగా ప్రతి ఏటా దాదాపు ఐదు కోట్ల మంది భారతీయులు పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. వైద్యం కోసం ప్రజలు 100 రూపాయలు ఖర్చు చేస్తే అందులో మందు బిల్లుల వాటా సగటున 65 నుంచి 85 రూపాయలు ఉంటుందని అంచనా. ప్రజలకు జనరిక్ మందులు అందుబాటులో ఉంచడం ద్వారా మందుల ధరలను అమాంతం తగ్గించవచ్చు. జనరిక్ మందులతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గిన మేరకు మందుల కంపెనీల లాభాలు పడిపోతాయి. అందుకే జనరిక్ మందులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం జరుగుతుంది. "జనరిక్ మందు' అనే పేరే నాసిరకం మందుకు పర్యాయపదంగా ప్రజలు భావించేంత తీవ్రంగా ఈ ప్రచారం సాగుతుంది. అవగాహనా లోపంతోనో, ఆర్థిక ప్రయోజనాల కోసమో దురదృష్టవశాత్తూ కొందరు డాక్టర్లు కూడా ఈ ప్రచారంలో భాగమయ్యారు. ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు జనరిక్ మందులపై అవగాహన కల్పించే బాధ్యతను సహజంగానే జన విజ్ఞాన వేదిక భుజానికెత్తుకుంది. ఆ కర్తవ్యంలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక ఆరోగ్య కన్వీనర్ డా॥ఎమ్.రమాదేవి రచించిన "అందుబాటులో మంచి మందులు- జనరిక్" అనే చిరు పుస్తకాన్ని జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురించింది. 'జనరిక్ మందులు అంటే ఏమిటి? అవి తక్కువ ధరలకు ఎలా లభిస్తాయి? అవి నాణ్యమైనవేనా? వంటి ప్రశ్నలకు రచయిత సూటిగా జవాబు చెప్పారు. జనరిక్ మందులు పేటెంటెడ్ మందులతో సమానమైన నాణ్యత కలిగి ఉంటాయని ఘంటాపథంగా చెప్పారు. ఎన్నో సాంకేతిక అంశాలను సరళమైన భాషలో, ఆకట్టుకునే శైలిలో వివరించారు. బ్రాండెడ్ జనరిక్ మందులపై ముద్రించిన ధరలకు జనరిక్ మందుల షాపులలో అమ్మకం ధరలకు మధ్యనున్న తేడాని పట్టికల ద్వారా వివరించడం బాగుంది.రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్ అనుభవం చదివినప్పుడు 'మన రాష్ట్రంలో కూడా ఇలా చేయెచ్చు కదా'! అనిపిస్తుంది. మందుల రంగంలో నిపుణుల అభిప్రాయాలు, దీర్ఘకాలిక జబ్బులకు జనరిక్ మందులు వాడుతున్న ప్రజల అనుభవాలను పొందుపరచడం రచయిత వాదనకు అదనపు బలాన్ని చేకూర్చాయి. డా॥రమాదేవి ప్రస్తుతం హైదరాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆమె రాసిన 'చేయూత, ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి?' పుస్తకాలు మంచి ఆదరణ పొందాయి.

అందుబాటులో మంచి మందులు-జనరిక్,
డా॥ యం. రమాదేవి,
ప్రచురణ: జన విజ్ఞాన వేదిక,
పేజీలు: 36/-,
వెల: రూ. 25/-,
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తకాలయాలు.



క్షతగాత్ర, రచన: కె.వరలక్ష్మి,
పేజీలు: 136/-, వెల:రూ.95/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, గిరి ప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), జి.ఎస్.ఐ - హైదరాబాద్-068, ఫోన్: 242244, ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీల్లో.

మార్పును దృశ్యీకరించిన 'క్షతగాత్ర'

ఈ సంపుటిలో 18 కథలున్నాయి. వివిధ పత్రికల్లో ఈ కథలు ప్రచురింపబడి పాఠకుల ఆదరణ పొందాయి. ఆకాంక్షలు ఎన్నో, అలజడులెన్నెన్నో, సంఘర్షణను ఉసిగొల్పే సంఘటనలెన్నో. జీవితాన్ని దర్శించడమే కాదు, మార్పును దృశ్యీకరించేది కథ. వరలక్ష్మి గారివి వివిధ పత్రికల్లో 140కి పైగా కథలు, 4 నవలలు, కవితలు, వ్యాసాలు, నాటికలు ప్రసారం అయ్యాయి. జీవరాగం, మట్టి బంగారం, అతడు-నేను, క్షతగాత్ర, కథా సంపుటాలు, 'ఆమె' కవితా సంపుటి వచ్చాయి. అనేక పురస్కారాలు పొందారు. ఈ సంపుటిలో కుట్ర, విముక్త, రిక్షా, గుప్తం, మున్నా, కొడుకు, ఒక స్వప్నం ఒక మెలకువ, అన్వేషణ, నాన్న, మార్పు సహచరి, తోడు, శివంగి, చుక్కాని లేని నావ, గాలిపటం, క్షతగాత్ర, వెనక్కి నడుస్తున్నామా? కలకానిది-విలువైనది లాంటి 18 కథలున్నాయి. అన్ని కథల్లో చదివించే గుణం ఉంది. భద్రుడు పడవ ప్రయాణంలో లక్ష్మి- సిన్నోడుల జంట, పాపికొండలు (దూరపు కొండలు) చూస్తూ పడవ ప్రయాణంలో భద్రుడు, చిన్నోడు నుండి ఎన్నో విషయాలు... చేపలు పట్టే వారి జీవితాలు, పోలవరం ఆనకట్టలో డబ్బు పొందిన నిర్వాసితుడు "సింతాలు" జీవితం... డబ్బు జల్సాలకు ఖర్చు పెట్టి యాక్సిడెంట్‌లో కాళ్ళు దెబ్బతిని గండి పోశమ్మ గుడికాడ అడుక్కుతింటూ బతుకుబండి లాక్కొస్తున్న వైనం. సిన్నోడు సింతాలుకు సహకరించే పెద్ద మనసు, బావమరదళ్ళ సరసాలు. (లక్ష్మి-సిన్నోడు) పడవ ప్రయాణంలో ఆర్థిక చేయూత మొదలైన అంశాలు భద్రుడిలో మార్పు తెస్తాయి. ఇదే కథీకరణ. కలకానిది-విలువైనది కథాంశం. ఇలా అన్ని కథలూ ఆర్తితో మానవునిలోని మానవత్వ స్వభావాన్ని విప్పి చెబుతాయి. ఆలోచింపజేస్తాయి. భర్త అభిరాం ప్రవర్తన నచ్చని సుజన తల్లి కాబోయే తరుణంలో అతనిలో మార్పు కోసం లెటర్ రాసి మంచంపై ఉంచి పుట్టింటికి బయలు దేరుతుంది. అపార్ట్‌మెంట్‌లోని నీలిమ సుజనకు సాంత్వననిస్తూ మంచిగా ఉంటుంది. 'అభిరాం దృష్టిలో ఆడది అంటే చాలా తేలిక భావన. ప్రతి స్త్రీపై వెకిలి కామెంట్స్. అది భరించలేని సుజన నిజమైన క్షతగాత్ర అందుకే అతనిలో మంచి ప్రవర్తనకై పుట్టింటికి ప్రయాణమైంది. స్థూలంగా ఇది కథ. స్త్రీ సాధికారత, స్వావలంబన, స్వేచ్ఛ, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే కథాంశం. ఇలా అన్ని కథలూ మానవ సంబంధాలు, కుటుంబ నేపథ్యంలో సాగుతాయి. చక్కటి విలక్షణ కథాసంపుటి "క్షతగాత్ర".

తంగిరాల చక్రవర్తి

ఆహ్వానం

పుస్తక సమీక్షల కోసం పంపదలచిన వారు రెండు కాపీలను పోస్టు చేయగలరు.
మా చిరునామా : స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.

-ఎడిటర్

నీటి 'రెక్కలు'

అమెరికాలోని ఉత్తర కాలిఫోర్నియాలో ఇది దావానలాల కాలం. లక్షల ఎకరాల్లో ఉండే అడవిలో చిచ్చు రేగితే వేల ఎకరాల ప్రాంతం ఇట్టే కాలిబూడిదవుతుంది. అక్కడి వేసవి మొదలవడంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉధృతంగా వీచే పొడిగాలుల దెబ్బకు చెట్లు త్వరగా ఎండిపోతాయి. అక్కడి వింత వాతావరణ పరిస్థితులు వేసవిలోను మెరుపులను సృష్టిస్తాయి. మెరుపులు, పిడుగులు, యాక్సిడెంట్‌లు, వేటగాళ్ల క్యాంప్ ఫైర్ వంటి కారణాల వల్ల ఏటా వేల ఎకరాలు భస్మం అవుతుంటాయి. వీటిని అదుపు చేసేందుకు అక్కడి అగ్ని నిరోధక దళం విమానాలను వాడుతుంది. డీసీ 10 రకం వీటిలో ముందు వరసలో ఉంటుంది. తక్కువ ఎత్తులో ఎగురుతూ భారీ స్థాయిలో నీటిని, అగ్ని నిరోధక రసాయనాలను మోసుకెళ్లి అటవీ ప్రాంతంలో కురిపిస్తాయి. ఇవే లేకుంటే దావానలం ఎప్పుడో కాలిఫోర్నియా అడవులను మింగేసేది. కొన్ని వారాల క్రితమే జెరూసలెం వీటిసాయంతో వ్యాలీలో మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక శాఖకు చెందిన ఓ బృందం ఇప్పటి వరకు 300 దావానలాల్ని 1600 డీసీ 10 విమానాల రౌండ్ల ఫ్లైట్స్‌తో అదుపు చేయగలిగింది. వీటి నడిపేందుకు పైలట్లకు చాలా నైపుణ్యం కావాలి. ●

జీవిత కాలపు అనుబంధం

జైన్ సంస్థ మాత్రమే చేయగల ఒక వాగ్దానం
జైన్ డ్రిప్ వారి విశ్వసనీయమైన
విధానం ద్వారా అత్యధిక దిగుబడి

జీవిత భాగస్వామిని ఎంచుకొనడంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటామో ఒక బిందుసేద్య విధానాన్ని ఎంచుకునేటప్పుడు కూడ అంతే జాగ్రత్త అవసరం. వంశానుక్రమం, కుటుంబ పరపతి మరియు జీవితకాలపు నిబద్ధత రెండింటికి సమానమే. మీరు చూపే అన్ని సలక్షణాలు జైన్ డ్రిప్‌లో ఉన్నాయి. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ కల్గిన సేద్యపు విధానం **జైన్ బిందుసేద్యం**. ఎందుకు జైన్ బిందుసేద్యమే ఎన్నుకోవాలి?

- కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా విస్తృతంగా వాడబడేది **జైన్ సూక్ష్మ సేద్య విధానం** మాత్రమే.
- 48 విభిన్న పంటలలో 15.2 లక్షల ఎకరాలలో ఏకైక విధానం **జైన్ బిందుసేద్యమే.**
- అన్ని పరికరాలు సొంత ఫ్యాక్టరీలలో తయారు చేయబడి మీ అవసరాలకు పూర్తి పరికరాల్ని రూపొందించి అమర్చగలగడమే కాక విక్రయానంతర సేవలందించే సామర్థ్యం గల కంపెనీ **జైన్** మాత్రమే.
- అంతర్జాతీయ ప్రమాణాలు కలిగియుండి జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పొందిన ఏకైక భారతదేశపు బిందుసేద్య విధానం **జైన్ బిందుసేద్య విధానం** మాత్రమే.
- మీ సేద్యపు నీటి సమస్యలకు సరైన పరిష్కారము. పంట దిగుబడిలో అభివృద్ధి.
- నీటి వాడుకములో 30 - 40% పొదుపు. కూలీ ధరలలో ఆదా. కరెంటు ఆదా.
- దేశమంతా మారుమూల ప్రాంతాలకు కూడ విస్తరించిన డీలర్ల నెట్‌వర్క్ మరియు విక్రయానంతర సేవాకేంద్రాలు కలవు. కంపెనీ ప్రతినిధులు మీకు అందుబాటులో ఎల్లవేళల సేవలందించుదురు.

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

జైన్ పైప్సు	జైన్ డ్రిప్	జైన్ పిఇ పైప్సు	జైన్ స్ప్రింక్లర్స్	జైన్ గ్రీన్ హవుస్	జైన్ టిష్యూకల్చర్	జైన్ జీవన్ సోలార్ పంప్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్-500 080
ఫోన్: 040-2761 2593, 2765 4681, 9440797846, E-mail : jainhyderabad@jains.com, Website : www.jains.com

అమరావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు - 1. ☎ 0863-2235680, 2256699, 2256688
AIMS
AMARAVATHI INSTITUTE OF MEDICAL SCIENCES
GUNTUR
అమరావతి హాస్పిటల్
అమరావతి ఎమర్జెన్సీ, మెడికల్ & యాక్సిడెంట్
24 గం॥ ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ సౌకర్యం కలదు
పురుగు మందు కేసులు
పాముకాటు
కాలిన గాయాలు
యాక్సిడెంట్ కేసులు
అత్యాధునిక ఐ.సి.యు వసతి
లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్
ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరియు అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల కేసులు అనుమతించబడును.
DEPARTMENTS :
Critical Care
Pulmonology
General Medicine
General & Laparoscopic Surgery
Orthopaedic & Poly Trauma
Spine Surgery
ENT
Obstetrics & Gynaecology
Neurology
Neuro Surgery
Gastro Enterology
Urology
Anaesthesia & Pain Management
ECG
X-ray
Ultra Sound
Bronchoscopy
Operative Microschopy
Fully equipped Laminar flow operation theatres with Anaesthesia work stations & C-Arm
30 Bedded fully equipped ICU with Ventilators.
Seperate ICU for Septic Cases (Infectious Diseases, HIV & Burns)
JANANI DIAGNOSTICS GUNTUR
జనని డయాగ్నస్టిక్స్
ముక్కు నరసారెడ్డి ప్లాజా, ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు - 1. ☎ 0863-2256699, 2256688.
Clinical Chemistry
Hormone Assays
Hematology
Auto-Immunity & Rheumatology
Cancer Markers

ప్రజాశక్తి 35 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ENGINEERING & TECHNOLOGY
ESTD : 1997
PHARMACEUTICAL SCIENCES
ESTD : 2001
విశిష్టమైన విద్యారంగంలో
వినూత్న విద్యావిధానాలతో
మరింత ముందడుగు వేస్తూ...
మీ
SINCE: 1997
SGIT
జార్జి విద్యాసంస్థలు
మార్కాపురం
Diploma | B.Tech | M.Tech
Eamcet Code : SGIT
B.PHARMACY | M.PHARMACY
Eamcet Code : SGIP
98493 32122, 99633 33124
డా॥ ఆదిమూలపు సురేష్
B.E (CIVIL) M.Tech(CSE), FIE, MIETE
MISTE, C.Eng. (india) Ph.D. (CSE), Formerly IRAS
సాంకేతిక సలహాదారు, జార్జి విద్యాసంస్థలు
గౌ॥ శాసన సభ్యులు, సంతనూతలపాడు
డా॥ ఆదిమూలపు సతీష్
M.B.B.S., M.S (Opthal)
కార్యదర్శి, జార్జి విద్యాసంస్థలు